www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

సంపుటి - 4 సంచిక -116 సోమవారం 10 ఆగస్టు 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# ఘనంగా లాల్‌దర్వాజా మహాంకాళి బోనాలు

**అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ**

**దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**రూ.20 కోట్లతో ఆషాఢ బోనాల నిర్వహణం -బంగారు బోనం సమర్పించిన కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల**

**హైదరాబాద్(ప్రజావినికిడి):**
తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల జాతర హైదరాబాద్ పాతబస్తీలో కన్నులపండువగా సాగింది. లాల్ దర్వాజాలోని ప్రసిద్ధ సింహవాహిని మహంకాళి అమ్మవారికి భక్తులు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులతో లాల్ దర్వాజా పరిసర ప్రాంతాలన్నీ కిక్కిరిసిపోయాయి. జాతర సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అమ్మవారికి పట్టువస్త్రాలు, బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, టీపీసీసీ అధ్యక్షులు,

మిగతా 2లో.



## స్వాతంత్ర్య పోరాటానికి 'క్విట్ ఇండియా' కొత్త శక్తినిచ్చింది

**క్విట్ ఇండియా ఉద్యమం స్వాతంత్ర్య పోరాటానికి కొత్త ఊపునిచ్చిందన్న ప్రధాని**

**ఉద్యమకారుల ధైర్యసాహసాలు, త్యాగాలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని వ్యాఖ్య**

**'డూ ఆర్ డై' సంకల్పాన్ని దేశప్రజల్లో నింపిందని గుర్తు చేసుకున్న అమిత్ షా**

**ఉద్యమకారులకు నివాళులర్పించిన ప్రధాని, కేంద్ర హోంమంత్రి, యూపీ సీఎం**





**ఢిల్లీ ఆగస్టు 9: (ప్రజావినికిడి):**
చారిత్రాత్మక క్విట్ ఇండియా ఉద్యమం స్వాతంత్ర్య సంగ్రామానికి కొత్త శక్తిని అందించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ ఉద్యమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఆయన స్వాతంత్ర్య సమరయోధులకు ఘనంగా నివాళులర్పించారు. వారి ధైర్యసాహసాలు, త్యాగాలు రాబోయే తరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తూనే ఉంటాయని ప్రధాని పేర్కొన్నారు.ఆగస్టు విప్లవంలో పాల్గొన్న నేతలను, సమరయోధులను స్మరించుకుంటూ ప్రధాని మోదీ 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. "మహాత్మా గాంధీ నాయకత్వ స్ఫూర్తితో ప్రారంభమైన క్విట్ ఇండియా ఉద్యమం

మిగతా 2లో.

## మమతా బెనర్జీ కారుపై రాళ్ల దాడి

**మృతి చెందిన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లగా ఘటన**

**పోలీసుల సమక్షంలోనే దాడి జరిగిందని మమత ఆరోపణ**

**దాడిని ఖండించిన బీజేపీ, తమకు సంబంధం లేదని వెల్లడి**

**మరణాన్ని రాజకీయం చేస్తున్నారంటూ మమతపై సువేందు అధికారి విమర్శ**



**కోల్‌కతా ఆగస్టు 9: (ప్రజావినికిడి):**
పశ్చిమ బెంగాల్‌లో రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రయాణిస్తున్న కారుపై నిరసనకారులు దాడికి పాల్పడ్డారు. కోల్‌కతా సమీపంలోని ఉత్తర 24 పరగణాల జిల్లా హాలిసహర్‌లో ఈ ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఆమె కాన్వాయ్‌పై కొందరు రాళ్లు, ఇటుకలు, వాటర్ బాటిళ్లు విసిరారు.

మిగతా 2లో.

## పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి కేసీఆర్ పరామర్శ..



**రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం అందజేత**

**నల్లబెల్లిలో దివంగత ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ**

**హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించిన కేసీఆర్**

**రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం చెక్కులు అందజేత**

**సుదర్శన్‌రెడ్డితో అనుబంధాన్ని గుర్తుచేసుకుని భావోద్వేగం**

**పార్టీ అండగా ఉంటుందని కుటుంబానికి భరోసా**

**నర్సంపేట ఆగస్టు 9: (ప్రజావినికిడి):** బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగల్ జిల్లా నల్లబెల్లిలో పర్యటించారు. ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ ప్రకటించిన రూ. 2.25 కోట్ల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కులను కేసీఆర్ స్వయంగా

మిగతా 2లో.

## రాజమండ్రి ఘటనలో గాయపడిన ప్రియాంక మృతి

**సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచిన వైనం**

**మరణాన్ని ధ్రువీకరించిన వైద్యులు**

**ప్రమాదానికి కారణమైన ఇద్దరు నిందితులు ఇప్పటికే అరెస్ట్**



**హైదరాబాద్ ఆగస్టు 9: (ప్రజావినికిడి):**
రాజమండ్రిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మెడికో ప్రియాంక మృత్యువుతో పోరాడి ఓడిపోయింది. గత ఐదు రోజులుగా సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఆమె శుక్రవారం తుదిశ్వాస విడిచింది. ఓ వైద్యురాలిగా ఎంతో భవిష్యత్తు ఉన్న ప్రియాంక అర్ధాంతరంగా తనువు చాలించడంతో ఆమె కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

మిగతా 2లో.

## క్షేత్రస్థాయిలో పర్యటించాలి

**మంత్రులకు లోకేశ్ కీలక ఆదేశాలు**

**14 రోజుల్లో 40 లక్షల కుటుంబాలను కలిసిన టీడీపీ శ్రేణులు**

**కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రజలకు వివరణ**




2లో.

## బస్సులారీ ఢీ..

## 35 మందికి గాయాలు!

**పామిడి మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం**

**ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలు.. 15 మంది పరిస్థితి విషమం**

**బ్రిడ్జిపై నుంచి కిందకు పడిన వాహనాలు**



2లో.

## నేటితో సర్ ఆఖరు

**హైదరాబాద్‌లో 40 లక్షల ఓట్లు గల్లంతు?.. ఓటర్ల జాబితా సర్వేతో భారీ మార్పులు!**

**సుమారు 40 లక్షల ఓట్లు జాబితా నుంచి తొలగింపు అంచనా**

**సొంతూరిలో ఓటు హక్కుకే వలసదారుల మొగ్గు**

**సనత్‌నగర్‌లో అత్యధికంగా 45శాతం ఓట్ల రద్దుకు అవకాశం**

**ఆగస్టు 17న విడుదల కానున్న ముసాయిదా ఓటర్ల జాబితా**




2లో.

# ఘనంగా లాల్‌దర్వాజా మహంకాళి బోనాలు





**మొదటిపేజీ తరువాయి**

ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రులు, ప్రజాప్రతినిధులకు అర్చకులు, దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు.

**ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యత : మంత్రి పొన్నం ప్రభాకర్**

హైదరాబాద్ బోనాల జాతరకు ప్రపంచవ్యాప్తంగా ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా బోనాలను వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం రూ.20 కోట్లు కేటాయించిందని తెలిపారు. ఆలయానికి వచ్చిన వారందరికీ అమ్మవారి దర్శనం సులభంగా అయ్యేలా పకడ్బందీ ఏర్పాట్లు చేశామని చెప్పారు. నెల రోజులుగా జరుగుతున్న ఈ ఉత్సవాల్లో తెలంగాణ కళారూపాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయని తెలిపారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించిన అధికారులకు, పోలీసులకు అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, రైతాంగం సుభిక్షంగా ఉండాలని, తెలంగాణ అన్ని రంగాల్లో ముందుకు సాగాలని అమ్మవారిని వేడుకున్నట్టు చెప్పారు

**. భక్తులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు : మంత్రి కొండా సురేఖ**

ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని దేవాలయాల్లో బోనాల జాతరను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. అమ్మవారి దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

**బంగారు బోనం సమర్పించిన కలెక్టర్**

సింహవాహిని అమ్మవారికి హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల బంగారు బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు హైకోర్టు జస్టిస్ ఎస్. నంద అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. జాతరను పురస్కరించుకుని పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ బండా ప్రకాష్, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్యే తాగూర్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, మాజీ మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, వివిధ కార్పొరేషన్ చైర్మెన్లు మెట్టు సాయి కుమార్, సరితా తిరుపతయ్య యాదవ్, భాస్కర్, అజయ్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, నగర సీపీ సజ్జనార్, స్పెషల్ ఆఫీసర్ రవి, ఆర్డీవో రామకృష్ణ, సినీహీరోలు విజయ దేవరకొండ బ్రదర్స్, ప్రముఖ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగాతో పాటు పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా పోలీసులు విస్తృత బందోబస్తు నిర్వహించారు.

## రాజమండ్రి ఘటనలో గాయపడిన ప్రియాంక మృతి

**మొదటిపేజీ తరువాయి**

వివరాల్లోకి వెళితే, ఆగస్టు 3వ తేదీన తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలోని ప్రసాదిత్యమాల్ ప్రాంతంలో ప్రియాంక తన స్కూటర్‌పై వెళుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. మద్యం మత్తులో అతివేగంగా కారు నడిపిన సురవరపు దశ్వంత్, ఆంద్రూ జోసెఫ్ ఎడ్వర్డ్స్ అనే ఇద్దరు యువకులు ఆమె స్కూటర్‌ను ఉద్దేశపూర్వకంగా మూడుసార్లు ఢీకొట్టారు. ఈ ఘటనలో ప్రియాంక తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను రాజమండ్రిలోని స్థానిక ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని కిమ్స్‌కు తరలించారు.

అక్కడ ఆమెను కాపాడేందుకు వైద్యులు తీవ్రంగా శ్రమించారు. అయినప్పటికీ ఆమె కోలుకోలేకపోయింది. శుక్రవారం మధ్యాహ్నం 3:25 గంటలకు ప్రియాంక తుదిశ్వాస విడిచినట్టు కిమ్స్ వైద్యులు ప్రకటించారు.

ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితులు దశ్వంత్, ఆంద్రూలను ఇప్పటికే అరెస్ట్ చేశారు. వారిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు.

కాగా, తన కుమార్తె మృతికి కారణమైన వారిపై సాధారణ ప్రమాద కేసు కాకుండా, హత్య కేసు నమోదు చేయాలని ప్రియాంక తండ్రి డిమాండ్ చేశారు. ఇది కేవలం ప్రమాదం కాదని, ఉద్దేశపూర్వకంగా చేసిన హత్యేనని ఆయన ఆరోపిస్తున్నారు. పోలీసులు కూడా సీసీటీవీ ఫుటేజి పరిశీలించిన అనంతరం, కావాలనే ఢీకొట్టినట్టు గుర్తించారు. హత్యాయత్నం సెక్షన్లతో కేసును మరింత పకడ్డందీగా మార్చారు. ప్రియాంక స్వస్థలం తెలంగాణలోని గద్వాల జిల్లా అయిజ మండలం ఎక్లాస్ పూర్. ఆమె ఎంబీబీఎస్ అనంతరం రాజమండ్రిలో పీజీ చేస్తోంది. ఇప్పుడు ఆమె మృతితో స్వగ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

**మెడికో ప్రియాంక కుటుంబానికి రూ.20 లక్షల సాయం ప్రకటించిన సీఎం చంద్రబాబు**

రాజమండ్రిలో కారు ఢీకొట్టిన ఘటనలో మృతి చెందిన వైద్య విద్యార్థిని ప్రియాంక కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రూ. 20 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. ఆమె మరణ వార్త తనను తీవ్రంగా కలచివేసిందని, ఈ ఘటన అత్యంత విషాదకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రియాంక కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి తక్షణమే రూ. 20 లక్షల సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై తాను ఇప్పటికే జిల్లా అధికారులతో సమీక్షించానని గుర్తుచేశారు. ప్రమాదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారికి కఠిన శిక్ష పడేలా చూడాలని స్పష్టం చేశారు. ఈ కేసులో నిందితులను ఇప్పటికే అరెస్ట్ చేసి జైలుకు పంపినట్టు తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ వివరించారు. దీనిపై స్పందించిన సీఎం, నిర్లక్ష్యంగా వ్యవహరించి ఒక నిండు ప్రాణాన్ని బలిగొన్న వారికి కఠిన శిక్ష పడేలా బలమైన సెక్షన్లు నమోదు చేయాలని సూచించారు.

## బస్సులారీ ఢీ.. 35 మందికి గాయాలు!

**పామిడి మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం**

**ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలు.. 15 మంది పరిస్థితి విషమం**

**బ్రిడ్జిపై నుంచి కిందకు పడిన వాహనాలు**



**పామిడి, ఆగస్టు 9: (ప్రజావినికిడి):**

పామిడి మండలంలోని పొగరూరు గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రైవేట్ బస్సు, ఐచర్ లారీ ఢీకొనడంతో అదుపుతప్పి బ్రిడ్జిపై నుంచి కిందకు పడిపోయాయి. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 35 మంది ప్రయాణికులు గాయపడగా.. వారిలో 15 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

హైదరాబాద్ నుంచి బెంగళూరుకు సుమారు 35 మంది ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేట్ బస్సు ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో పొగరూరు సమీపంలోని 44వ జాతీయ రహదారిపైకి చేరుకుంది. అదే సమయంలో వచ్చిన ఐచర్ లారీని బస్సు ఢీకొట్టింది. దీంతో రెండు వాహనాలు అదుపుతప్పి బ్రిడ్జిపై నుంచి కిందకు పడిపోయాయి. ప్రమాదం జరిగిన వెంటనే బస్సులోని ప్రయాణికులు భయాందోళనకు గురై కేకలు వేయడంతో పరిసర ప్రాంతాల్లో కలకలం రేగింది.

**క్షతగాత్రులను ఆసుపత్రికి తరలింపు**

సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహకారంతో బస్సులో చిక్కుకున్న క్షతగాత్రులను బయటకు తీసి పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మొత్తం 35 మంది ప్రయాణికులకు చికిత్స అందించగా.. 15 మంది పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని సర్వజన ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది.

**క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్లు**

ప్రమాద తీవ్రతకు రెండు వాహనాల క్యాబిన్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇద్దరు డ్రైవర్లు క్యాబిన్లలో ఇరుక్కుపోవడంతో పోలీసులు, సహాయక సిబ్బంది గ్యాస్ కట్టర్ల సాయంతో వాహన భాగాలను తొలగించి వారిని బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు డ్రైవర్లను కూడా మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని సర్వజన ఆసుపత్రికి తరలించారు.

**నిద్రమత్తే కారణమా?**

అతివేగంగా ప్రయాణించడం, డ్రైవర్లు నిద్రమత్తులోకి వెళ్లడం వల్లే ప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా తెలుస్తోంది. అయితే ప్రమాదానికి అసలు కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అదృష్టవశాత్తూ ప్రమాదంలో ఎవరూ మృతి చెందలేదని, క్షతగాత్రులందరికీ వైద్య చికిత్స అందుతున్నట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

## స్వాతంత్ర్య పోరాటానికి 'క్విట్ ఇండియా' కొత్త శక్తినిచ్చింది

**మొదటిపేజీ తరువాయి**

మన స్వాతంత్ర్య పోరాటానికి నూతన ఉత్తేజాన్ని ఇచ్చింది. వలస పాలన నుంచి విముక్తి పొందాలన్న మన ప్రజల అచంచల సంకల్పాన్ని ఇది ప్రతిబింబించింది. ఈ ఉద్యమంలో పాల్గొన్న వారందరినీ స్మరించుకుంటున్నాను. వారి ధైర్యం ప్రతి భారతీయుడికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమే" అని మోదీ తన సందేశంలో తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా క్విట్ ఇండియా ఉద్యమకారులకు నివాళులర్పించారు. ఈ ఉద్యమం దేశప్రజలందరినీ ఏకతాటిపైకి తెచ్చిందని, 'డూ ఆర్ డై' (చేయండి లేదా చావండి) అనే సంకల్పాన్ని, అద్వితీయమైన ధైర్యాన్ని వారిలో నింపిందని ఆయన గుర్తు చేసుకున్నారు. జాతి ప్రయోజనాలకు ప్రథమ స్థానం ఇస్తూ, స్వదేశీని ప్రోత్సహిస్తూ ఆత్మనిర్భర్, వికసిత భారత్ లక్ష్యాల కోసం పనిచేయడానికి ఈ రోజు స్ఫూర్తినివ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సైతం ఉద్యమకారుల ధైర్యాన్ని, త్యాగాలను స్మరించుకున్నారు. 'డూ ఆర్ డై' నినాదంతో సమరయోధులు జాతీయ చైతన్యాన్ని రగిలించి స్వాతంత్ర్య పోరాటానికి ఒక నిర్ణయాత్మక దిశను చూపారని ఆయన పేర్కొన్నారు. 1942 ఆగస్టు 8న బొంబాయిలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ 'క్విట్ ఇండియా' తీర్మానాన్ని ఆమోదించిన తర్వాత ఈ ఉద్యమం ప్రారంభమైంది. అప్పుడు మహాత్మా గాంధీ 'డూ ఆర్ డై' అనే చారిత్రాత్మక పిలుపునిచ్చారు. బ్రిటిష్ పాలన అంతం కావాలని డిమాండ్ చేశారు. బ్రిటిష్ ప్రభుత్వం కఠినంగా అణిచివేసినప్పటికీ, దేశవ్యాప్తంగా నిరసనలు, సమ్మెలు వెల్లువెత్తాయి. భారత స్వాతంత్ర్య పోరాట తుది దశలో ఇది ఒక మహోద్యమంగా నిలిచింది.

## పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి కేసీఆర్ పరామర్శ..

**మొదటిపేజీ తరువాయి**



సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు. నల్లబెల్లిలోని నివాసానికి చేరుకున్న కేసీఆర్, తొలుత సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సుదర్శన్‌రెడ్డితో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని కేసీఆర్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. సుదర్శన్‌రెడ్డి అత్యంత సాదాసీదా జీవితం గడిపారని, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మంచి నేత అని కొనియాడారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రకటించిన ఆర్థిక సాయంలో భాగంగా సుదర్శన్‌రెడ్డి ఇద్దరు పిల్లల పేరున చెరో రూ.1 కోటి, ఆయన తల్లి అమృతమ్మ సంరక్షణ కోసం రూ.25 లక్షల చెక్కులను కేసీఆర్ అందించారు. పిల్లల చదువులు, భవిష్యత్తుతో పాటు కుటుంబ సంక్షేమ బాధ్యతలను పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తుందని స్పష్టం చేశారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

కేసీఆర్ రాక సందర్భంగా నల్లబెల్లికి బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు, అభిమానులు భారీగా తరలివచ్చారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి నివాసం వద్ద జనం కిక్కిరిసిపోవడంతో స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి, పరిస్థితిని అదుపులోకి తెచ్చి కేసీఆర్ కాన్వాయ్‌కు దారి కల్పించారు. కేసీఆర్ వెంట పలువురు పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## మమతా బెనర్జీ కారుపై రాళ్ల దాడి

**మొదటిపేజీ తరువాయి**

పోలీసు కస్టడీలో మరణించినట్లు భావిస్తున్న తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) కార్యకర్త బిర్జు కియోట్ కుటుంబాన్ని పరామర్శించేందుకు మమతా బెనర్జీ వెళుతుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. దోపిడీ ఆరోపణలపై అరెస్టయిన బిర్జు, పోలీసుల కస్టడీలో మరణించాడు. ఈ నేపథ్యంలో, మమత పర్యటనను వ్యతిరేకిస్తూ స్థానికులు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. ఆమె కారును చుట్టుముట్టి, దానిపై బురద పూశారు. "చోర్ భగావో" (దొంగను తరిమేయండి) అంటూ నినాదాలు చేశారు.

ఈ దాడిపై మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. పోలీసుల సమక్షంలోనే గుర్తుతెలియని వ్యక్తులు తన వాహనంపై రాళ్లతో దాడి చేశారని ఆమె ఆరోపించారు. "కారు అద్దాలు మూసి ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డాను. లేదంటే ఆ రాళ్లు తలకు తగిలి నా తల పగిలిపోయేది" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని, వారు కేవలం అధికార బీజేపీకి మాత్రమే రక్షణ కల్పిస్తున్నారని మండిపడ్డారు. ఆమెతో పాటు ఉన్న లోక్‌సభ ఎంపీ కల్యాణ్ బెనర్జీ, రాజ్యసభ ఎంపీ డోలా సేన్ కూడా అధికారుల వైఫల్యాన్ని విమర్శించారు. ఈ ఘటనను రాష్ట్ర బీజేపీ చీఫ్ సమీక్ భట్టాచార్య ఖండించారు. ఈ దాడితో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను డిమాండ్ చేశారు. అయితే, సీఎం సువేందు అధికారి దీన్ని మమత సృష్టించిన డ్రామాగా అభివర్ణించారు. కస్టడీ మరణాన్ని రాజకీయం చేసేందుకే మమత బలవంతంగా ఆ ప్రాంతానికి వెళ్లారని ఆరోపించారు. మృతుడి కుటుంబ సభ్యులు అధికారుల తీరుపై సంతృప్తి చెందారని, మరణానికి కచ్చితమైన కారణం తెలియాలని మాత్రమే వారు కోరుకుంటున్నారని తెలిపారు. తన పర్యటనతో మమత ప్రజా జీవితానికి ఆటంకం కలిగించారని విమర్శించారు.

ఇటీవలే మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై కూడా ఆయన నియోజకవర్గంలో దాడి జరిగిన నేపథ్యంలో, తాజా ఘటనతో రాష్ట్రంలో రాజకీయ ఉద్రిక్తతలు మరింత పెరిగాయి

## నేటితో సర్ ఆఖరు

**హైదరాబాద్ ఆగస్టు 9: (ప్రజావినికిడి):**

రాజధాని హైదరాబాద్ నగరంలో ఓటర్ల సంఖ్యలో భారీ మార్పులు చోటుచేసుకోబోతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సర్వే (రా×=) కారణంగా గ్రేటర్ పరిధిలో ఏకంగా 40 లక్షల ఓట్లు జాబితా నుంచి తొలగిపోయే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. రేపటితో ఈ సర్వే కార్యక్రమం ముగియనుండగా, నిన్నటి వరకు ఉన్న సమాచారం ప్రకారం రాజధానిలోని మూడు జిల్లాల పరిధిలో ఉన్న 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 1.14 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో దాదాపు మూడో వంతు ఓట్లు రద్దయ్యే సూచనలు కనిపిస్తుండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ప్రభుత్వ సెలవులు ఉన్నప్పటికీ ఆది, సోమవారాల్లో బూత్ స్థాయి అధికారుల (బీఎల్ఓ) నుంచి ఉన్నతాధికారుల వరకు విధుల్లోనే ఉంటారని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించని ఓటర్లు ఎవరైనా ఉంటే వెంటనే అందజేయాలని ఆయన సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి చేసి, ఈ నెల 17న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించేందుకు అధికారులు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

**సనత్‌నగర్‌లో సగానికి పైగా ఓట్లు రద్దు!**

ఓట్ల తొలగింపు ప్రభావం దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో ఇది అత్యధికంగా ఉంది. ముఖ్యంగా సనత్‌నగర్ నియోజకవర్గంలో మొత్తం 2,54,030 ఓట్లు ఉండగా, వాటిలో ఏకంగా 1.16 లక్షల ఓట్లు (45.68%) రద్దయ్యే అవకాశం ఉందని అంచనా. అదేవిధంగా జూబ్లీహిల్స్‌లో 44.21%, ఎల్బీనగర్‌లో 42.19%, ఉప్పల్‌లో 40.05%, మహేశ్వరంలో 40.03% ఓట్లు జాబితా నుంచి తొలగిపోవచ్చని అధికారులు చెబుతున్నారు. అత్యల్పంగా ఇబ్రహీంపట్నంలో 21.43% ఓట్లు రద్దయ్యే అవకాశం ఉంది. రాబోయే రెండు రోజుల్లో ఈ సంఖ్యల్లో స్వల్ప మార్పులు మాత్రమే ఉండొచ్చని భావిస్తున్నారు.

**ఓట్ల తొలగింపునకు కారణాలేంటి?**

దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఉపాధి, ఇతర అవసరాల కోసం ప్రతిరోజూ వేలాది మంది హైదరాబాద్‌కు వలస వస్తుంటారు. ఇక్కడే స్థిరపడి ఓటరుగా నమోదు చేసుకుంటారు. అయితే, ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఓటరు సర్వే జరుగుతున్న నేపథ్యంలో.. సొంత ఊరితో పాటు హైదరాబాద్‌లోనూ ఓటు హక్కు ఉన్నవారు తమ ఓటును సొంతూరిలోనే కొనసాగించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో నగరంలో ఎన్యుమరేషన్ ఫారాలను చాలామంది అధికారులకు తిరిగి ఇవ్వలేదని తెలుస్తోంది. ఇదే ఓట్ల సంఖ్య భారీగా తగ్గడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

మరోవైపు కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా తమకు ఇప్పటికీ ఎన్యుమరేషన్ ఫారాలు అందలేదని లక్షలాది మంది ఓటర్లు ఆరోపిస్తున్నారు. ఇలాంటి వారంతా ఆన్‌లైన్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. సోమవారం గడువు ముగిసిన తర్వాత తుది లెక్కలు తేలనుండగా, ఆగస్టు 17న వెలువడనున్న ముసాయిదా జాబితాపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

## క్షేత్రస్థాయిలో పర్యటించాలి

**మంత్రులకు లోకేశ్ కీలక ఆదేశాలు**

**అమరావతిఆగస్టు 9: (ప్రజావినికిడి):**

తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం 2 ఏళ్ల నమ్మకం' కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో సాధించిన ప్రగతిని, సంక్షేమ ఫలాలను ప్రజలకు నేరుగా వివరించే ఈ కార్యక్రమం ఆదివారం నాటికి 14వ రోజుకు చేరుకుంది. గడిచిన 14 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు 40.74 లక్షలకు పైగా కుటుంబాలను నేరుగా కలుసుకుని రికార్డు సృష్టించాయి. కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల నుంచి వస్తున్న అపూర్వ స్పందనతో ఈ కార్యక్రమం పండుగ వాతావరణంలో సాగుతోంది. ఇందులో భాగంగా ఆదివారం ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 3.53 లక్షల ఇళ్లను టీడీపీ నాయకులు, కార్యకర్తలు సందర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన 'సూపర్ సిక్స్' హామీల అమలు తీరును, ఇతర సంక్షేమ పథకాల ద్వారా పేదలకు అందుతున్న ప్రయోజనాలను ప్రతి కుటుంబానికి వివరిస్తున్నారు.

ఈ కార్యక్రమ పురోగతిపై టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ప్రత్యేక దృష్టి సారించారు. కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకు ఆయన పార్టీ శ్రేణులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా, జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రులు తమకు కేటాయించిన ప్రాంతాల్లో తప్పనిసరిగా పర్యటించాలని, ప్రజలతో మమేకమై ప్రభుత్వ విజయాలను వివరించాలని స్పష్టం చేశారు. క్లస్టర్, మండల స్థాయి నాయకులను ఫోకస్ బూత్‌లకు అనుసంధానించి, సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి గ్రామ స్థాయి కార్యకర్తల వరకు ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో సమష్టిగా పాల్గొంటున్నారని, ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని మరింత పటిష్ఠం చేయాలని టీడీపీ భావిస్తోంది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
సోమవారం 10 ఆగస్టు 2026

# దేవాలయాన్ని కూల్చారు.. భక్తుల విశ్వాసాన్ని కూల్చగలరా.?

**120 ఏళ్ల ఆలయ చరిత్రకు సమాధి ఎందుకు.?**

**కూల్చిన స్థలంలోనే ఆలయం పునర్నిర్మించాలి. 500 గజాల స్థలం కేటాయించాలి..**

**ప్రభుత్వం హిందూ దేవాలయాల పట్ల వివక్ష చూపొద్దు:పల్లె వినోద్ కుమార్ చిన్నబోయిన నవీన్ యాదవ్..**



ఆలయం కూల్చి వేసిన దృశ్యం

**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
హిందూ దేవాలయాల పరిరక్షణపై ప్రభుత్వం స్పష్టమైన విధానం అవలంబించాల్సిన సమయం ఆసన్నమైంది. శతాబ్దానికి పైగా చరిత్ర కలిగిన ఆలయాన్ని తొలగించి భక్తుల మనోభావాలను దెబ్బతీయడం ఎంతవరకు సమంజసం అంటూ బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీ పరిసరాల్లోని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కూల్చివేసిన ఆలయ స్థలంలోనే వెంటనే ఆలయ నిర్మాణం చేపట్టాలని, కనీసం 500 గజాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని ఆలయ కమిటీ సభ్యులు పల్లె వినోద్ కుమార్ చిన్నబోయిన నవీన్ యాదవ్ కోరుతున్నారు.

**120 ఏళ్ల ఆలయ చరిత్రకు ముగింపు పలికారా.?**

బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీ సమీపంలోని ప్రభుత్వ భూమి పరిధిలోని సర్వే నంబర్ 102/1 వద్ద పాత పెద్దమ్మ దేవాలయం సుమారు 120 సంవత్సరాలుగా ఉందని ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు చెబుతున్నారు. ఏటా బోనాలు, దసరా,వినాయక చవితి వంటి పండుగలను ఘనంగా నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోందని పేర్కొన్నారు.

అయితే జూలై 23, 2025న అధికారులు ఆలయాన్ని పూర్తిగా కూల్చివేశారని, అమ్మవారి విగ్రహంను తొలగించి తరలించారని కమిటీ సభ్యులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆలయాన్ని తొలగించే ముందు భక్తుల మనోభావాలను, ఆలయ చారిత్రక ప్రాధాన్యతను పరిగణనలోకి తీసుకున్నారా.? అనే ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వచ్చాయి.

**బోనాలు చేసుకునేందుకు కూడా అనుమతి లేదా?**

ఈ ఏడాది పూజలు, బోనాలు నిర్వహించుకునే అవకాశం కల్పించాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు సీనియర్ న్యాయవాదులు బ్రహ్మదండి రమేష్, శివప్రసాద్,పల్ల రాధికా శర్మ ద్వారా హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. గతంలోనూ ఈ అంశంపై రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. హైకోర్టులో సీనియర్ న్యాయవాది బ్రహ్మదండి రమేష్ వాదనలు వినిపిస్తూ కనీసం ఈ ఏడాది ఆగస్టులో బోనాలు నిర్వహించుకునేలా అనుమతి ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏఏజీ కూడా వాదనలు వినిపించినప్పటికీ,పూజలు నిర్వహించేందుకు అనుమతి లభించకపోవడం బాధాకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**200 గజాల నుంచి 500 గజాల వరకు స్థలం కేటాయించండి**

ఆలయ పునర్నిర్మాణం కోసం తొలుత సుమారు 200 గజాల స్థలం కేటాయించాలని కోరామని, ప్రస్తుతం ఆలయ నిర్మాణం,భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కనీసం 500 గజాల స్థలం కేటాయించాలని పల్లె వినోద్ కుమార్, చిన్నబోయిన నవీన్ యాదవ్ కోరారు. గతంలో ఎండోమెంట్ కమిషనర్, జీహెచ్ఎంసీ కమిషనర్ సైతం ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారని, అయితే ఆ హామీలు అమలుకు నోచుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

**అన్యమత ప్రార్థనా స్థలాల విషయంలోనూ ఇదే వైఖరేనా.?**

తమ ఆలయాన్ని తొలగించినట్లే ఇతర మతాలకు చెందిన ప్రార్థనా స్థలాలను కూడా తొలగించేవారా.? అని ఆలయ కమిటీ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. హిందూ దేవాలయాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే భావన కలగకుండా తక్షణమే స్పష్టమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

120 ఏళ్ల చరిత్ర కలిగిన పాత పెద్దమ్మ తల్లి ఆలయాన్ని తిరిగి అదే ప్రాంతంలో పునరుద్ధరించి, ప్రభుత్వ స్థలంలో 500 గజాలు కేటాయించడంతో పాటు ఆలయ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై హైకోర్టు పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తెచ్చి హిందూ ఆలయాలకు ప్రాధాన్యత కల్పించాలని కమిటీ సభ్యులు కోరుతున్నారు.



120 సంవత్సరాల నుండి ఉన్న అమ్మవారి ఆలయం

## బంగారు మైసమ్మ దేవాలయంలో ఘనంగా బోనాల పండుగ వేడుకలు..



**కొత్తపేట,(ప్రజావినికిడి):**
చైతన్యపురి ఫణిగిరి కాలనీలోని బంగారు మైసమ్మ దేవాలయంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల పండుగ సందర్భంగా, హరి ప్రసాద్ అదేవిదంగా శ్రీనివాస్ యాదవ్ ఆహ్వానంమేరకు,బిఅర్ఎస్‌సీనియర్ నాయకులు పవన్ యాదవ్ (అడ్వకేట్), రాహుల్,గణేష్, రాకేష్,ఉమేష్, నరేష్,నాగరాజు అలాగే ఇతర సభ్యులు అమ్మవారిని దర్శించుకుని, ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,దయగల అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో,ఆనందంగా జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకోవడం జరిగింది. అమ్మవారి కృపాకటాక్షాలు ప్రతి ఒక్కరిపై ఎల్లప్పుడూ ఉండాలని,ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

## సాయిబాబా కాలనీ,రాం నగర్ కాలనీ బోనాల ఉత్సవాలు





**షాద్‌నగర్,(ప్రజావినికిడి):**
పట్టణంలోని సాయిబాబా కాలనీ,రాం నగర్ కాలనీలలో ఘనంగా నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుతూ,ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రైతులకు మంచి పంటలు పండాలని, వ్యాపారాలు అభివృద్ధి చెంది వ్యాపారులకు మంచి జరగాలని, కష్టజీవులు,కార్మికులు సంతోషంగా జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు రవీందర్ యాదవ్ తెలిపారు. ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం,ఆర్థిక అభివృద్ధి నెలకొనాలని ఆకాంక్షించారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొంటూ,ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించిన నిర్వాహకులు, స్థానిక ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు,కౌన్సిలర్లు జి.టి వసంత శ్రీనివాస్,పిన్నమోని గోపాల్,వాణి పాండురంగారెడ్డి, ఎస్పీ శివ,మాజీ కౌన్సిలర్లు నంద కిషోర్,శ్రీనివాస్ గౌడ్,నాయకులు నక్కల వెంకటేష్ గౌడ్,చీపిరి రవి యాదవ్,లంకాల రాఘవేందర్ రెడ్డి, రాజేందర్ సింగ్,చంద్రశేఖర్ రెడ్డి, రవీందర్,అభిలాష్,బాలు యాదవ్,రాము నాయక్, వినోద్,సంతోష్,రాందాస్,శివ తదితరులు,ఉత్సవ కమిటీ సభ్యులు,భక్తులు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని పలు అమ్మవార్ల దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి





**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మన్సూరాబాద్ డివిజన్ యువ నాయకులు జక్కిడి.రఘువీర్ రెడ్డి చే కలిసి మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని పలు అమ్మవార్ల దేవాలయాలను సందర్శించి, ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొనడం జరిగింది. దయగల అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, మాజీ అధ్యక్షులు టంగుటూరి నాగరాజు, పోచబోయిన జగదీశ్ యాదవ్ వర్కింగ్ ప్రెసిడెంట్ నర్రి వెంకన్న, బి ఆర్ఎస్ పార్టీ నాయకులు, ఆలయ కమిటీ వారు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తొండుపల్లి పోచమ్మ దేవాలయంలో బోనాలు





**శంషాబాద్, (ప్రజావినికిడి):**
బోనాల పండుగ సందర్భంగా శంషాబాద్ జిహెచ్ఎంసి పరిధిలోని తొండుపల్లి గ్రామంలో ప్రసిద్ధి గాంచిన పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండ విశ్వేశ్వర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా రూరల్ బిజెపి అధ్యక్షుడు రాజ్‌భూపాల్ గౌడ్ ముఖ్యఅతిథులుగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన తో పాటు రాష్ట్ర, జిల్లా,మండల స్థాయి బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి ముక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో డప్పు చప్పులతో వాతావరణం భక్తి శ్రద్దలతో నిండిపోయింది. బిజెపి రంగారెడ్డి జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు బాత్కు శ్రీనివాస్ యాదవ్ కొండ విశ్వేశ్వర్ రెడ్డి కి, రాజ్ భూపాల్ గౌడ్ కు స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కొండ విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి ప్రతీక అయిన బోనాల పండుగ అందరికీ సుఖసంతోషాలు కలిగించాలని అమ్మవారిని కోరినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటిని అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు మహేందర్, రాజేందర్ రెడ్డి మున్సిపల్ అధ్యక్షుడు,ఏం విజయభాస్కర్ రెడ్డి మున్సిపల్ జనరల్ సెక్రెటరీ, వంశీ యాదవ్ మున్సిపల్ బీజేవైఎం అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి,కె.జగజీవన్ రెడ్డి, జనార్ధన్,గోరక్ కుమార్,వినయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పెంజర్ల గ్రామంలో మహంకాలమ్మ,బీరప్ప స్వామి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి





**కొత్తూరు,(ప్రజావినికిడి):** మండలంలోని పెంజర్ల గ్రామంలో నిర్వహించిన మహాకాలమ్మ,బీరప్పస్వామి బోనాల ఉత్సవాలకు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సి నవీన్ రెడ్డి మాట్లాడుతూ, సంస్కృతీ సంప్రదాయాలకు తెలంగాణ ఆత్మగౌరవానికి, విశిష్ట సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక బోనాలు అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీలత సత్యనారాయణ, మాజీ సర్పంచ్ వనం బాల్ రాజ్,మాజీ ఉపసర్పంచులు సుధాకర్,రమేష్,బీఆర్ఎస్ విలేజ్ ప్రెసిడెంట్ సన్గూడెం జంగయ్య,నాయకులు దేశాల భీమయ్య, శంకరయ్య,రాజేందర్ రెడ్డి,రమేష్ కుమ్మరి పోచయ్య,వనం బిర్యాయ, పలుకుట మల్లేష్,పొన్నం శేఖర్,కోట మల్లేష్,బి. రాజు,నందిగామ సుధాకర్, మామిడి రాజేందర్ రెడ్డి,రాముట్ల రాములు,పొన్నం జంగయ్య,పొన్నం రాజు,పొన్నం యాదయ్య, మంద శీను, మంద కుమార్,కురుమ,శివ చారి,యాదవ సంఘమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



## బోనాల సందర్భంగా మహంకాళి మందిర్ లో ప్రత్యేక పూజల్లో

# పాల్గొన్నషాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు








**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
భాగ్యనగరంలో ఆషాఢ మాసం బోనాల వేడుకల సందర్భంగా చార్మినార్ ప్రాంతంలోని హరిబౌలి శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయంలో ఆషాడ మాసం పురస్కరించుకొని తెలంగాణ సాంప్రదాయాలకు ప్రతీక పైన బోనాల పండుగ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,2004 సంవత్సరంలో నాటి సిఎం ఉన్న నారా చంద్రబాబు నాయుడు గోల్కొండ ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధిచేయడంజరిగిందన్నారు. (1680)దశకంలో నాటి గోల్కొండ రాజు అయినా అబ్దుల్ హసన్ తనిషా రాజు వద్దకు బోనాల పండుగ విశిష్టతను అక్కన్న,మాదన్న,లు రాజు వివరించగా ముస్లిం రాజు అయిన కూడా హిందూ సంస్కృతి ఆచారాలను గౌరవిస్తూ నాటి గోల్కొండ సంస్థాన సైన్యాధిపతి అయినా అక్కన,మాదన్న ల విజ్ఞప్తి మేరకు ముస్లిం రాజు అయిన హిందూ సాంప్రదాయాలను గౌరవిస్తూ నాడు ప్రారంభమైన బోనాల ఉత్సవం నేటికీ తెలంగాణ వ్యాప్తంగా ప్రజల విశ్వాసాలకు నమ్మకాలకు ప్రత్యేకంగా నిలుస్తున్నాయిఅన్నారు.
అనంతరం ఖైరతాబాద్ లోని బంగారు మైసమ్మ తల్లి ఆశీస్సులు పొందిన బక్కని నరసింహులు..
ఖైరతాబాద్ నియోజకవర్గంలోని బంగారు మైసమ్మ తల్లి ఆశీస్సులు పొందిన టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు,షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, అమ్మవారి కృప కటాక్షాలు ఆశీస్సులు ఎల్లవేళలా యావత్తు తెలుగు ప్రజలపై ఉండాలని,సకాలంలో వర్షాలు కురిసి రైతన్నల ఇంత సిరిసంపదలు ఉండాలని రైతే దేశానికి వెన్నెముక కాబట్టి రైతు బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.
ఈ కార్యక్రమానికి హాజరై అమ్మవారిని దర్శించుకున టిడిపి హైదరాబాద్ కోఆర్డినేటర్ నాగు నాగేష్,శ్రీకాంత్ గోగంధర్ సింగ్,ఖమ్మం జిల్లా టిడిపి జనరల్ సెక్రెటరీ కే.హరీష్,వనపర్తి నాయకులు చంద్రశేఖర్,ఇబ్రహీంపట్నం తెలుగు యువత అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, టిడిపి నాయకులు యువకులు,పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు.

## రంగేశ్వరి నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల పండుగలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**నాగోల్,(ప్రజావినికిడి):**బోనాల పండుగ సందర్భంగా నాగోల్ డివిజన్ పరిధిలోని గ్రీన్ టెర్రస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నందు ఎల్బీనగర్ నియోజకవర్గం బారాస పార్టీ మహిళా అధ్యక్షురాలు రంగేశ్వరి నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల పండుగలో పాల్గొన్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తదితరులు ఈ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు.





బోనాల పండుగ సందర్బంగా కర్మన్ ఘాట్ లో

# వాజేడు మండలంలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

**ఏజెన్సీలో ఉన్నా చట్టాలను పటిష్టంగా అమలు పరచాలి -ఆదివాసీ సంఘాల,జెఏసి, ఐక్య వేదిక డిమాండ్..**






**వాజేడు,ఆగష్టు 10,(ప్రజావినికిడి):**వాజేడు మండల కేంద్రంలో ఆగష్టు 9,ఆదివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం కొమరభీం విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించడం జరిగింది కొమరం భీమ్ విగ్రహం నుండి రామాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలుపరచాలని పిసా చట్టాన్ని అటవీ హక్కుల చట్టాన్ని పటిష్టంగా అమలుపరచాలని జీఓ,నెం 3 పునరుద్ధరణ చేయాలని ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు.తర్వాత కొమరం భీమ్ విగ్రహం వద్ద ఎట్టి విద్యాసాగర్, మెడెం.నాగరాజు అధ్యక్షతన జెఏసి,తరుపున సభ నిర్వహించారు. సభలో అందులో ఆదివాసి సంఘాల నాయకులు ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న చట్టాలను పటిష్టంగా అమలుపరచకపోతే ఈ ఉద్యమాన్ని గూడెం గూడెం తిరిగి ఆదివాసీలను అందరిని ఏకం చేసి పెద్దఎత్తున ఉద్యమం చేపడుతామని ఈ సభాముఖంగా ప్రభుత్వాన్ని, అధికారులను హెచ్చరించారు. ఈ సభలో పాయం. జానకిరామణ, మోడం. నాగరాజు తొర్రంసంతోష్, ఎట్టి చంద్రశేఖర్ పధం.సుధాకర్, చేప లక్ష్మణ్, బోడెబోయిన సురేష్, కంబాలపల్లి, హరినాథ్,జెజ్జరి, సత్యనారాయణ నెల్లబోయిన సర్వేశ్ ఇండ్ల సమ్మయ్య చింత మోహన్,యాలం సుబ్బయ్య, ఆదివాసి నాయకులు కులపెద్దలు ఆదివాసి ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# జెప్టో డెలివరీకి వెళ్లి యువకుడు అదృశ్యం



**నాగోల్,(ప్రజావినికిడి):**
స్వగ్రామమైన కృష్ణా జిల్లా గుమ్మలపాడు గ్రామానికి చెందినజెప్టో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న ఓ యువకుడు పని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. నాగోల్ లోని కో-ఆపరేటివ్ బ్యాంక్ కాలనీకి చెందిన సైదు భాగ్యరాజు (34) జెప్టో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు.ఈ నెల 4న జెప్టో డెలివరీ పని ఉందని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన భాగ్యరాజు తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు అతడి కోసం బంధువులు, స్నేహితులు, పరిచయస్తుల వద్ద ఆరా తీసినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో ఆందోళనకు గురైన అతడి భార్య రేవతి నాగోల్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది.రేవతి ఫిర్యాదు మేరకు నాగోల్ పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. భాగ్యరాజు ఎక్కడికి వెళ్లాడు, చివరిసారిగా ఎవరిని కలిశాడు, ఎవరితోనైనా ఫోన్‌లో మాట్లాడాడా అనే కోణాల్లో పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. అతడి ఫోన్ కాల్ వివరాలు,ఇతర ఆధారాలను పరిశీలిస్తూ ఆచూకీ కోసం గాలింపు చేపట్టినట్లు నాగోల్ సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపారు. భాగ్యరాజు ఆచూకీ లభిస్తే వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందిస్తామని పోలీసులు పేర్కొన్నారు

## మాల్ మైసమ్మ దేవాలయంలో ఘనంగా బోనాల ఉత్సవాలు

**పాల్గొన్న ఆలయ ట్రస్ట్ చైర్మన్ గుంటి లక్ష్మణ్**

**ఎల్బీనగర్,ఆగస్ట్ 9,(ప్రజావినికిడి):**


నగరమంతా అమ్మవారి బోనాల ఉత్సవాలతో తెల్లవారుజాము నుండే ఆలయాలన్ని కిటకిటలాడుతున్నాయి. ఎల్. బి .నగర్ లోని మాల్ మైసమ్మ ఆలయంలో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండే ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది.ఆలయ ట్రస్ట్ చైర్మన్ గుంటి లక్ష్మణ్ కుటుంబం సమేతంగా బోనం సమర్పించి అమ్మ వారిని దర్శనం చేసుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎంతో విశిష్టతగల అమ్మవారు ఈ దేవాలయంలో కొలువై ఉన్నారన్నారు. అమ్మవారి ఆశీస్సులు భక్తు లందరికి కలిగి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శోభన్ బాబు, కమిటీ సభ్యులు,భక్తులు,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అంతిరెడ్డిగూడలో పోచమ్మ మైసమ్మ బోనాల పండుగ

**హాజరైన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**

**నందిగామ,(ప్రజావినికిడి):**


నందిగామ మండలంలోని అంతిరెడ్డి గూడ గ్రామంలో నిర్వహించిన పోచమ్మ మైసమ్మ బోనాల ఉత్సవాలకు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై ఆలయాలలో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు అనంతరం ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ, అమ్మవారి కరుణాకటాక్షాల వల్ల సమాజంలో శాంతి, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని,ప్రతి ఒక్కరి సంకల్పం నెరవేరాలని,ఆ తల్లి ఆశీస్సులు ఎల్లప్పుడూ అందరికీ తోడుండాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంతిరెడ్డిగూడ సర్పంచ్ మంజుల, యాదగిరి ఉపసర్పంచ్ మల్లేష్ యాదవ్, మాజీ ఉపసర్పంచ్ కుమార్ గౌడ్,నాయకులు తుమ్మల నర్సిములు యాదవ్ ,దేపల్లె సురేష్ గౌడ్,ఎంబడి రవి యాదవ్,సుమన్ యాదవ్,మేకొండ జంగయ్య, వెంకటేష్,తదితరులు పాల్గొన్నారు.




## ఉమ్మడి బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని

## పలు ఆలయాలలో బోనాల జాతరలో

## పాల్గొన్న:తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి

ఎల్బీనగర్,(ప్రజావినికిడి):


బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని బి.ఎన్.రెడ్డి నగర్ బి.యన్ రెడ్డి నగర్ ఫేస్ 3 శ్రీపురం కాలనీ సాగర్ హౌసింగ్ కాంప్లెక్స్‌చైతన్య నగర్‌దుర్గా సాయి నగర్ మెడికల్ అండ్ హెల్త్ కాలనీసాయిరాం కాలనీస్నేహమై నగర్ సాయి గార్డెన్స్ ఆఫీసర్స్ కాలనీ వనస్థలిపురం వెంకటరమణ కాలనీ శ్రీ శ్రీనివాస కాలనీ బృందావన్ మెడోస్ పాపిరెడ్డి కాలనీ జక్కిడి నగర్ గాయత్రి నగర్ బ్యాంక్ కాలనీ వెంకటేశ్వర కాలనీలలో బోనాల పండుగ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి.ఈ సంబరాలలో భాగంగా మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈట రాజేందర్ సతీమణి శ్రీమతి ఈటల జమున, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు, ఎల్బీనగర్ అసెంబ్లీ ఇంచార్జ్ సామ రంగారెడ్డి బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి ఆ అమ్మవారి దివ్య ఆశీస్సులను పొందడం జరిగింది.ఈ సందర్భంగా అమ్మవార్లకు బోనాలు సమర్పించిన మహిళా భక్తులకు,కాలనీ వాసులకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. డివిజన్ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, అమ్మవారి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ అందరిపై ఉండాలని ఆయన అమ్మవారిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ శ్రీధర్ రావు,ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, ప్రేమ్ నాథ్, ఉపాధ్యక్షులు పవన్ రెడ్డి,ఓబి సిమోర్చా అధ్యక్షులు మహేష్ గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు మెరుగు వెంకటేష్, బీజేవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భార్గవ్ తేజ,పార్టీ సీనియర్ నాయకులు శంకరయ్య గౌడ్, విజయ్ కుమార్,రవిశంకర్,శ్రీనివాసరావు, వెంకట్ రెడ్డి, సుధీర్ కుమార్, చిన్న యాదవ్,మురళి, విజయ్ కుమార్, సునీల్ రెడ్డి, కిషోర్,దిలీప్ గౌడ్,సిద్ధేశ్వర్, భాను,మనోజ్ కుమార్,శివ,శ్రీరామ్ కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు,స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆషాడ మాస బోనాల పండుగ



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం హెచ్ఐఎల్ రాఘవేంద్ర కాలనీ అయోధ్య నగర్ పలు ఆలయాలలో తెలంగాణ రాష్ట్ర బోనాల పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బోనాల పండుగను పురస్కరించుకుని కాలనీలలో భక్తులు మహిళలు అమ్మవారికి ఊరేగింపుతో బోనాలు సమర్పించుకున్నారు. ఫలహారం బండి ఊరేగింపు పోతరాజుల విన్యాసాలు ఎంతో కన్నుల పండుగగా జరిగాయి.ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కుంట సిద్ధిరాములు , ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలంతా భక్తి శ్రద్ధలతో సంతోషంగా జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ప్రతి కుటుంబంలో శాంతి సౌభాగ్యం విల్లివిర్యాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఏఎల్ ఆలయ కమిటీ చైర్మన్ టీ.రాజేశ్వర్ ప్రధాన కార్యదర్శి తోకల నగేష్ రెడ్డి ఆర్థిక కార్యదర్శి సిహెచ్ రాజు, మరియు అయోధ్య నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జోయల్ బాబి ఆలయ ధర్మకర్త అచ్చిబాబు వారి మిత్రబృందం సీనియర్ నాయకులు సుమయ్య ఉమేష్ ,భాస్కర్ నిర్వహణ కమిటీ సభ్యులు భక్తులు మహిళలు స్థానిక కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు

# భాగ్యలత బిడిఎల్ కాలనీ లో ఘనంగా బోనాల పండుగ వేడుకలు..

## భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాల సమర్పణ..



**ఎల్బీనగర్,ఆగస్ట్ 9,(ప్రజావినికిడి):** ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని హయత్ నగర్ డివిజన్ భాగ్యలతలోని బిడిఎల్ కాలనిలో బోనాల పండుగ వేడుకలు అంగరంగ వైభవంగా, భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించారు. పోచమ్మ దేవాలయాల్లో అమ్మవారికి భక్తులు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు. ఆషాఢ మాసంలో అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిస్తే కుటుంబాల్లో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఈ నమ్మకంతో మహిళలు సంప్రదాయ దుస్తుల్లో అలంకరించుకుని తలపై బోనాలను మోసుకుంటూ ఆలయాలకు చేరుకుని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ప్రాంగణాలు భక్తుల రాకతో సందడిగా మారగా, అమ్మవారి నామస్మరణతో పరిసర ప్రాంతాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ప్రత్యేక పూజలు,భక్తి కార్యక్రమాలతో బోనాల ఉత్సవాలు వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా స్థానిక మాజీ డివిజన్ అధ్యక్షుడు కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు ఆషాఢ మాస బోనాల సందర్భంగా ఆలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధ్యక్షుడు కృష్ణారెడ్డి పేర్కొన్నారు. అదేవిధంగా ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు మాట్లాడుతూ బోనాల పండుగను ప్రతి సంవత్సరం సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తూ వస్తున్నామని తెలిపారు. భక్తులకు అన్నదాన ప్రసాదాన్ని అందించి, అమ్మవారి ఆశీస్సులు పొందేలా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. చల్లని తల్లి కరుణతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలి.. ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలి అని భక్తులు అమ్మవారిని ప్రార్థించారు. అంతేకాకుండా ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి, చెరువులు, కుంటలు నిండాలని.. రైతుల పొలాల్లో పచ్చని పంటలు కళకళలాడాలని భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. అమ్మవారి కరుణతో రైతులు సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, తాండూరు ప్రాంతం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని భక్తులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బాబు, ఉపాధ్యక్షుడు కొండల్ రెడ్డి, కోశాధికారి శ్రీనివాస్,బాల సిద్ధులు, చంద్రశేఖర్ ,జనార్దన్ రెడ్డి,జంగారెడ్డి,సోమి రెడ్డి,నాగేశ్వర్ రావు,కృష్ణా రెడ్డి,సమ్మయ్య,మోహన్ రెడ్డి,లింగం మరియు అరుణోదయ కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వనస్థలిపురం ప్రశాంత్‌నగర్‌లో ఘనంగా బోనాల ఉత్సవాలు

## పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్‌లో బోనాల పండుగ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ లగ్గొని శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ గిరిజనుల హక్కులను కాలరాసేందుకే రిజర్వేషన్ ల పంచాయతీ

## యం.గోపి నాయక్ గిరిజన సంఘం రాష్ట నాయకులు




**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):** తెలంగాణ గిరిజన సంఘం రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రోజు ఎన్టీఆర్ నగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రపంచ ఆదివాసి గిరిజన హక్కుల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గిరిజన సంఘం రంగారెడ్డి జిల్లా నాయకులు మూడవత్ గోపి నాయక్ మాట్లాడుతూ, గిరిజనులందరికీ ముందుగా ప్రపంచ ఆదివాసి గిరిజన దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల పట్ల గిరిజనులు నివసిస్తున్న ప్రాంతాలపట్ల కుట్ర పూరిత విధానం అవాలంభిస్తున్నారని. గిరిజన అటవీ సంపధను విదేశీ పెట్టుబడిదారీ సంస్థలకు అప్ప చెప్పి గిరిజనులను అడవి నుండి దూరం చేసే విధానాన్ని అవలంబిస్తున్నారని విమర్శించారు. అటవీ హక్కుల చట్టాన్ని తుంగలో తొక్కి అటవీ సంపదను ఆదాని అంబానీలకు అప్పజెప్పి అడవి నుండి ఆదివాసి గిరిజనులను బలవంతంగా తరిమి వేస్తున్నారని అన్నారు. కొంతమంది అధికార పార్టీ నాయకులు గిరిజనులు దళితులు పేదలు వారి హక్కులను కాలరాసే విధంగా రిజర్వేషన్లను తొలగించాలన్న వాదనను తెరపైకి తీసుకొస్తున్నారని అన్నారు. రిజర్వేషన్ తొలగించడం అనేఈ పద్ధతి గిరిజనుల హక్కులను కాలరాసే విధంగా ఉన్నదని విమర్శించారు. 80 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో ఇంకా ఆదివాసి గిరిజన లంబాడీలు తమ ప్రాంతాల నుండి పట్టణ ప్రాంతాలకు వలస బతుకులు కొనసాగిస్తున్నారని విద్యా వైద్యం,ఉద్యోగం,రాజకీయ రంగాలకు దూరంగా ఉన్నారని ఈ సమస్యల పరిస్కారం చేయడం లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఏ విధంగానైనా చిత్తశుద్ధి లేదని అన్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీలో ఆటోలను తీసుకొస్తానన్న ప్రచారం లంబాడి గిరిజనులకు పట్టణాలలో ఆటో కార్మికులుగా జీవిస్తున్న గిరిజన పేద ఆటో కార్మికులను వారి కుటుంబాన్ని రోడ్డున పడేసే కుట్రను చేస్తున్నట్లు అర్థమవుతుందని అన్నారు. ఇప్పటికే ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వాలు పట్టించుకోకుండా మళ్ళీ ఆర్టీసీ ఆధ్వర్యంలో ఆటోలను నడుపుతామనే విధానం సరైనది కాదని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. హైదరాబాద్ పట్టణం లో నివసిస్తున్న వేలాది మంది గిరిజనులు సొంత గృహాలు లేక మురికి వాడలలో నివసిస్తూ అనేక ఇబ్బందులు పడుతున్నారని అర్హులైన వారికీ ప్రభుత్వం ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# ఆషాడ మాస బోనాల పండుగ పురస్కరించుకొని పలు ఆలయాలను దర్శించుకున్న: బికేఆర్



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** ఆషాడ మాస బోనాల పండుగ పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు ఆలయాలను దర్శించుకొని బోనాల ఉత్సవాలో పాల్గొన్న తెలంగాణ స్టేట్ ప్రోటోకాల్ కో ఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో భాగంగా పోచంపల్లి,బౌరంపేట్,సూరారం రాజీవ్ గాంధీ నగర్,సాయి బాబా నగర్,సూరారం కాలనీ,బదుర్ పల్లి గ్రీన్ హిల్స్ కాలనీ, బహదూర్ పల్లి ఇందిరమ్మ కాలనీ,శ్రీ రామ్ నగర్ కాలనీ గండి మైసమ్మ పలు అమ్మవారి ఆలయాలను దర్శించుకున్నారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎంతో వైభవంగా ఆషాడ మాసంలో జరుపుకునే ఈ ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు నిదర్శనం అని అన్నారు. ఆడపడుచులు అమ్మ వారికి బోనమెత్తి, పోతరాజుల నృత్య ప్రదర్శనలు, శివసత్తుల ఆటపాటలతో అమ్మను కొలుచుకుని ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని జరుపుకునే గొప్పనైన పండుగ బోనాలు అని అన్నారు. నియోజకవర్గ ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యాక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,శ్రీధర్ రెడ్డి,సాధు యాదవ్,శ్రీశైలం యాదవ్, మహేందర్ రెడ్డి,అమర్ పటేల్,పద్మ రావు,కిరణ్,కృష్ణ,మహేష్,బికెఆర్ టీమ్ సభ్యులు, ఆలయాల నిర్వహణ కమిటీ సభ్యులు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు జైల్ భరో

**హైదరాబాద్(ప్రజావినికిడి):** ఢిల్లీలో యువత పోరాటం ముగిసిందో లేదో దేశంలో మరో పోరాటానికి రంగం సిద్ధమైంది. గతంలో నిర్వహించిన రైతాంగ పోరాటం సందర్భంగా ప్రధాని మోడీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నదాతలుడశ్రామికవర్గాన్ని కట్టుబానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లు తమకొద్దంటూ కార్మికులుడతమకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి పొట్టగొట్టొద్దంటూ వ్యవసాయ కూలీలు కలిసికట్టుగా మరో పోరాటానికి సంసిద్ధులయ్యారు. అందులో భాగంగా క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో సోమవారం కార్మికులు, కర్షకులు, కూలీలు సంయుక్తంగా జైల్‌భరో కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఇది ఈ ఒక్క రోజుతో ఆగబోదనీ, కేంద్రంలోని బీజేపీ విధానాలపై దేశవ్యాప్తంగా సంఘటిత పోరాటాలకు నాంది కాబోతుందని వారు హెచ్చరిస్తున్నారు. ఆ దిశగా కార్యాచరణను రూపొందించుకుని ముందుకెళతామని ప్రకటించారు. గతంలో ఢిల్లీ రైతాంగ ఉద్యమానికి, నిన్నటి జంతర్ మంతర్ ఉద్యమానికి వెన్నుదన్నుగా ఉన్న వర్గ సంఘాలే ఈ పోరాటాన్ని ముందుకు నడిపిస్తున్నాయి. కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా, వ్యవసాయ కార్మిక సంఘాలు ఒకే తాటిపైకి వచ్చి జైల్‌భరోను తలపెట్టాయి. ఇందులో భాగంగా సోమవారం హైదరాబాద్‌లో చలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లా కేంద్రాలు, డివిజన్, మండల, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమాలు కొనసాగనున్నాయి. సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు ఇప్పటికే జిల్లాల్లో సదస్సులు నిర్వహించి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశాయి. సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 1,580 సెంటర్లలో జీపుజాతాలు, నాలుగు వేల గ్రామాల్లో సభలు, 480 పారిశ్రామిక ప్రాంతాల్లో పారిశ్రామిక క్లస్టర్ మీటింగ్‌లు,వందలాది మందితో పరిశ్రమల వద్ద గేటు మీటింగ్‌లు నిర్వహించారు. ఐదు లక్షల కరపత్రాలను కార్మికులకు పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. జైల్ భరో కార్యక్రమంలో భాగంగా పలు జిల్లాల్లో చేపట్టబోయే నిరసనల్లో రాష్ట్ర నేతలు పాల్గొంటారు. హైదరాబాద్‌లో చేపట్టబోయే 'చలో రాజ్ భవన్' కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు పాల్గొంటారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో, ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య గోదావరి ఖనిలో పాల్గొంటారు. ఖమ్మంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతిరేని సుదర్శన్‌రావు, మిర్యాలగూడలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పాల్గొంటారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య మహబూబాబాద్‌లో పాల్గొననున్నారు.



# బోనాల పండుగ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న

## నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి





**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ సందర్భంగా నియోజకవర్గంలోని బాచుపల్లి, నిజాంపేట్ 2 బిహెచ్ కె, బండారి లేఔట్, మల్లంపేట్ ప్రాంతాల్లోని శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ, శ్రీశ్రీశ్రీ ఎల్లమ్మ ఆలయాల్లో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిచారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి అభినందన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతిలో భాగమైన బోనాల పండుగను ప్రతి సంవత్సరం ఎంతో భక్తి శ్రద్ధలతో అమ్మవారి పూజించుకుంటామని అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో,ఆనందంగా జీవించాలని, నియోజకవర్గంలో శాంతి,అభివృద్ధి, సౌభ్రాతృత్వం మరింతగా వెల్లివిరియాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి అమ్మవారిని ప్రార్థించారు. బోనాల పండుగ ప్రజల ఆత్మగౌరవానికి, ఘనమైన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ పవిత్ర పండుగను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమాల్లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ఆలయ కమిటీ సభ్యులు స్థానిక ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# బోనాల పండుగ సందర్భంగా ఆలయాలను సందర్శించిన పుప్పాల భాస్కర్..

## సూరారం డివిజన్‌లో ఘనంగా తెలంగాణ రాష్ట్ర బోనాల పండుగ వేడుకలు..



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం డివిజన్ పరిధిలో తెలంగాణ రాష్ట్ర బోనాల పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రేణుక ఎల్లమ్మ, నల్లపోచమ్మ ఆలయాల కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు సిఎంసి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ డివిజన్ పరిధిలోని పలు ఆలయాలను సందర్శించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకుని ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా పుప్పాల భాస్కర్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, సంతోషంగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. అమ్మవారి ఆశీస్సులతో సూరారం డివిజన్ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఆలయ కమిటీ సభ్యులు,స్థానిక ప్రజలు పుప్పాల భాస్కర్ కి ఘన స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



## తెలంగాణ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపిన మహ్మద్ సాధిఖ్.,

**ఆగస్టు 9: (ప్రజావినికిడి):**



తెలంగాణ రాష్ట్రంలో బోనాల పండుగకు ప్రత్యేక స్థానం వుంది., గ్రామ దేవతలు అనబడే పోషమ్మ, ఎల్లమ్మ, మల్లమ్మ, నల్ల పోచమ్మ,మైషమ్మ, బూరుజు మైషమ్మ,.రక రక లుగా పేర్లతో గ్రామ దేవతలు వెలసినారు., గ్రామ దేవతలు ఏడు గురు అక్క చెల్లెళ్లు., వారికీ ఒక తమ్ముడు పోతురాజు., గ్రామ దేవతలు మహిమలు గల దేవతలు విరి పేరు పైన గ్రామాల్లో, పట్టణాల్లో, బోనాల పండుగ ఘనంగా నిర్వహిస్తారు., రాష్ట్ర ప్రజలందరికి బి ఆర్ ఎస్ రాష్ట్ర మైనారిటీ నేత మహ్మద్ సాధిఖ్ ఒక ప్రకటనలో బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పూర్వం గ్రామాల్లో పట్టణాల్లో తప్పక గ్రామ దేవతల ఆలయాలు ఉండేవి, ప్రతి సంవత్సరం బోనాల పండుగ ను భక్తి శ్రద్దలతో నిర్వహిస్తారు.పూర్వం వైద్య సౌకర్యాలు లేని రోజుల్లో ప్రజలకు మసుచి, అమ్మ తల్లి, రక రక ల వ్యాధి లు సోకితే గ్రామ దేవతలకు పూజించి, నైవేద్యం, పెట్టితే రోగాలు పూర్తిగా నయం అయ్యాయానే మాట మన పూర్వికులు చెప్పుతారు. అలాగే గ్రామాల్లో పూర్వం బోనాల పండుగకు గ్రామ బోనం అనే పేరుతో కుల మతాలకు అతీతంగా గ్రామ దేవతల ఆలయం నిర్వాహకులు ప్రతి ఇంటి నుండి బియ్యం, బెల్లం, శక్కెర, పసుపు, మంచి నూనె, అల్లం ఎల్లిపాయలు,ఉప్పు , తదితర వస్తువులు సేకరించి మొదటగా గ్రామ దేవతలకు గ్రామ, ఓరి, బోనం అని సమర్పించి, గ్రామాన్ని ప్రజలను కాపాడు తల్లి అని మొక్కులు చెల్లించుకొనే వారని సాధిఖ్ గ్రామీణ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తు చేశారు.తర్వాత గ్రామ ఆడపడుచులు బోనం సమర్పిస్తారని అన్నారు. హైదరాబాద్ నగరం లో కూడ బోనాల పండుగ చూడ ముచ్చటగా భక్తి శ్రద్దలతో జరుపుకుంటారని అన్నారు. తెలంగాణ అంటే నె పండుగలకు కోదువ లేదని ఏడాది పాటు ఏదో ఒక సందర్భంలో పండుగలు వుంటాయని, ప్రపంచం లో ఎక్కడ కూడ ఇన్ని పండుగలు లేవని, కేవలం భారత దేశం పండుగలకు పెట్టింది పేరు అని సాధిఖ్ కొనియాడారు.

## ముర్కుంజాల్‌లో 20 నూతన విద్యుత్ లైట్ల ఏర్పాటు

### ఎప్పటికప్పుడు మరమ్మతులు చేస్తామన్న సర్పంచ్ అనూష లాల్ కుమార్

**ఆగస్టు 9: (ప్రజావినికిడి):**



కంగ్టి మండల పరిధిలోని ముర్కుంజాల్ గ్రామంలో ఆదివారం 20 నూతన విద్యుత్ లైట్లను ఏర్పాటు చేశామని గ్రామ సర్పంచ్ సారంగి అనూష లాల్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.గ్రామంలో ఏ సమస్య ఉన్నా ఎప్పటికప్పుడు మరమ్మతు పనులు చేస్తున్నామని చెప్పారు.వర్షాకాలంలో కొన్ని బల్బులు వెలగకపోవడంతో వాటిని తొలగించి కొత్త విద్యుత్ బల్బులను అమర్చినట్లు వివరించారు.పలు కాలనీల్లో విద్యుత్ బల్బులు పాడైపోయాయని తమ దృష్టికి రావడంతో వెంటనే స్పందించి నూతన విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ దఫా మొత్తం 20 లైట్లను గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేశామని తెలిపారు.గ్రామంలో ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, త్వరలోనే పరిష్కరిస్తామని సర్పంచ్ అనూష లాల్ కుమార్ హామీ ఇచ్చారు.

## ఏడుపాయల దుర్గమ్మను దర్శించుకున్న చింత సాయినాథ్



**ఆగస్టు 9: (ప్రజావినికిడి):**





ఏడుపాయల శ్రీ వనదుర్గ భవానీ మాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తనయుడు చింత సాయినాథ్ ఏడుపాయల శ్రీ వనదుర్గ భవానీ మాతను సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారి తనయుడు చింత సాయినాథ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సాయినాథ్ గారికి ఘన స్వాగతం పలికి, అమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని సాయినాథ్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు,పార్టీ నాయకులు , భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ : దరఖాస్తుకు మరో రెండు రోజులే గడువు



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇళ్ల టవర్స్' పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉందని హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్, కమిషనర్ వీపీ గౌతమ్ స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అర్హులైన పేద, దిగువ మధ్యతరగతి ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.జీహెచ్ఎంసీ పరిధిలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్మించనున్న 7,680 ఎల్ఐజీ ఇళ్ల కోసం ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరిస్తోంది. దరఖాస్తుల సమర్పణకు ఆగస్టు 10 (సోమవారం) ఆఖరు తేదీ అని అధికారులు తెలిపారు. శనివారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా సుమారు 35,125 దరఖాస్తులు వచ్చినట్లు వీపీ గౌతమ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకం కింద ఒక్కో ఫ్లాట్ నిర్మాణ వ్యయం రూ. 11 లక్షలు కాగా, ప్రభుత్వం రూ. 5 లక్షల సబ్సిడీ అందిస్తోంది.
వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, ఆగస్టు 30న కంప్యూటరైజ్డ్ లాటరీ ద్వారా పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. లాటరీలో ఎంపికైన వారికి ఏడాదిలోపు ఇళ్లను నిర్మించి అందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. లాటరీలో ఇల్లు కేటాయించని దరఖాస్తుదారులు చెల్లించిన రూ. 10,000 డిపాజిట్ ఫీజును తిరిగి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని అధికారులు భరోసా ఇచ్చారు. ఆసక్తి కలిగిన అర్హులు మీసేవ కేంద్రాలు లేదా ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

# గిరిజన అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం**

**విజయవాడలో కార్యక్రమం... హాజరైన సీఎం చంద్రబాబు**

**ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని సీఎం పిలుపు**

**జీవో నెంబర్ 3ను చట్టపరంగా కాపాడతామని ఆదివాసులకు భరోసా**

**అరకు కాఫీ తరహాలో స్థానిక గిరిజన ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్**

**ద్రౌపది ముర్ము స్ఫూర్తితో దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలి**



**అమరావతిఆగస్టు 9: (ప్రజావినికిడి):**
అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం వేదికగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. దేశభక్తి అంటే కేవలం సరిహద్దుల్లో పోరాడటం మాత్రమే కాదని, ప్రతి పౌరుడు తన వృత్తిలో విజయం సాధించి, సమాజానికి సేవ చేయడమే నిజమైన దేశభక్తి అని ఉద్బోధించారు. ప్రతి ఒక్కరూ తమకంటూ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా విజయవాడ అంబేద్కర్ కళావేదికలో జరిగిన సభకు చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ... గిరిజన సమాజానికి సమగ్ర అభివృద్ధి, సంక్షేమంపై పలు కీలక హామీలు ఇస్తూ, వారి హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు.సాధారణ ఆదివాసీ కుటుంబంలో పుట్టి, అనేక కష్టాలను అధిగమించి, దేశ ప్రథమ పౌరురాలిగా అత్యున్నత శిఖరాలను అధిరోహించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని చంద్రబాబు అన్నారు. ఆమె స్ఫూర్తితో గిరిజన యువత ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని సూచించారు. జాతీయ జెండాతో పాటు మీ అజెండా కూడా ఉండాలని పిలుపునిచ్చారు."సంకల్పం బలంగా ఉంటే ఏదైనా సాధించవచ్చు. ద్రౌపది ముర్ము, అబ్దుల్ కలాం, బీఆర్ అంబేద్కర్, ఎన్టీఆర్, నరేంద్ర మోదీ వంటి మహనీయులంతా సాధారణ కుటుంబాల నుంచి వచ్చినవారే. 'నేను ఏంటి? ఎలా ఎదగాలి? ఈ సమాజానికి, దేశానికి నేనేం ఇవ్వాలి?' అనే లక్ష్యంతో పనిచేయాలి. మీ విజయం దేశ విజయమవుతుంది.." అని ఆయన పేర్కొన్నారు. ఈ స్ఫూర్తిని వ్యాపింపజేసేందుకు ఆగస్టు 9 నుంచి 15 వరకు 'అనే నేను' పేరుతో ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

**గిరిజన ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్..**

గిరిజన ప్రాంతాల్లోని ఆర్థిక స్వావలంబనపై చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. తాను 25 ఏళ్ల క్రితం ఒక చిరు ప్రయత్నంగా ప్రారంభించిన అరకు కాఫీ, నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతి గాంచడాన్ని ఆయన గుర్తుచేశారు. "అరకు కాఫీకి నేనే పేరు పెట్టాను. దానిని మార్కెటింగ్ చేసి, ప్రధాని నరేంద్ర మోడీ నుంచి ఆస్ట్రేలియా ప్రధాని వరకు బహుకరించి, గ్లోబల్ బ్రాండ్‌గా నిలబెట్టాను. ఇవాళ పారిస్‌లో కూడా అరకు కాఫీ స్టాళ్లు ఉన్నాయి" అని గర్వంగా ప్రకటించారు.
ఇదే స్ఫూర్తితో సీతంపేట పసుపు, రంపచోడవరం రబ్బర్, పార్వతీపురం పైనాపిల్, తేనె, తాటిబెల్లం వంటి స్థానిక ఉత్పత్తులకు విలువ జోడించి, బ్రాండింగ్ చేసి, మార్కెటింగ్ చేసే బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుందని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లోని రైతులు పండించే ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ సంస్థలతో 19 అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చుకున్నట్లు వెల్లడించారు.

**మౌలిక వసతులు, విద్య, వైద్యానికి పెద్దపీట**

గిరిజన ప్రాంతాల సమగ్రాభివృద్ధికి నాలుగు కీలక రంగాలపై దృష్టి పెడుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం, ఆదాయ మార్గాల పెంపునకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.మౌలిక వసతులు: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో 2,336 గిరిజన ఆవాసాలకు మిషన్ మోడ్‌లో రోడ్ కనెక్టివిటీ కల్పిస్తామన్నారు. 'జల్ జీవన్ మిషన్' కింద 2027 డిసెంబర్ నాటికి ప్రతి గిరిజన ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. మారుమూల గ్రామాలకు సైతం టెలికాం కనెక్టివిటీ అందించి, డోలీ మోతలు లేని సమాజాన్ని నిర్మిస్తామన్నారు.విద్య: 'తల్లికి వందనం' కింద 4.92 లక్షల మంది గిరిజన విద్యార్థులకు రూ.650 కోట్లు అందించామని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. విశాఖలోని మేకవారిపాలెంలో 600 మంది విద్యార్థులతో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేసి, ఐఐటీ వంటి జాతీయ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఏటా కనీసం 100 మంది గిరిజన విద్యార్థులు జాతీయ స్థాయి సంస్థల్లో సీట్లు సాధించడమే లక్ష్యమన్నారు.
వైద్యం: పాడేరులో మెడికల్ కాలేజీతో పాటు పార్వతీపురం, రంపచోడవరం, శ్రీశైలం వంటి ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మిస్తామన్నారు. 'సంజీవని' ప్రాజెక్ట్ ద్వారా ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను డిజిటలైజ్ చేస్తామని, సికిల్ సెల్ అనీమియా బాధితులకు రూ.10,000 పింఛను అందిస్తూ, వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తామని ప్రకటించారు.

**జీవో నెంబర్ 3 పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం**

గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలు స్థానికులకే దక్కాలనే ఆశయంతో ఎన్టీఆర్ హయాంలో పురుడుపోసుకుని, తాను 2000 సంవత్సరంలో తీసుకొచ్చిన జీవో నెంబర్ 3ను కాపాడతామని చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. సుప్రీంకోర్టులో ఈ జీవోను కొట్టివేయడానికి గత ప్రభుత్వ వైఫల్యమే కారణమని విమర్శించారు. "ఈ జీవోను చట్టపరంగా, రాజ్యాంగబద్ధంగా నిలబడేలా పటిష్టమైన కార్యాచరణ రూపొందిస్తాం. ఆదివాసుల హక్కుల పరిరక్షణకు ఈ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఆవేశంతో కాకుండా ఆలోచనతో, అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని దీనిపై ముందుకు వెళతాం" అని భరోసా ఇచ్చారు.
గిరిజన ప్రాంతాలను కేవలం వెనుకబడిన ప్రాంతాలుగా కాకుండా, అపార అవకాశాలున్న ప్రాంతాలుగా చూస్తున్నామని, అక్కడి పచ్చదనం, స్వచ్ఛమైన వాతావరణాన్ని ఉపయోగించుకుని టూరిజం హబ్‌లుగా తీర్చిదిద్దుతామని అన్నారు. ప్రతి గిరిజన ఇల్లు 'అతిథి గృహం'గా మారాలని, తద్వారా ప్రపంచానికి ఆతిథ్యం ఇవ్వాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఒక చెట్టు నాటి, దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 2047 నాటికి 'వికసిత్ భారత్', 'స్వర్ణాంధ్రప్రదేశ్' లక్ష్యాలను సాధించడంలో ఆదివాసీలు కీలక పాత్ర పోషించాలని, వారి సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్ఘాటించారు.

## బహుజనోద్యమ బలోపేతం వల్లనే రాజ్యాంగ వ్యతిరేక శక్తులను ఒడిస్తాం

### బీఎస్పీ ఛీఫ్ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం

**ఆగస్టు 9: (ప్రజావినికిడి):**







బహుజనోద్యమ బలోపేతం వల్లనే రాజ్యాంగ వ్యతిరేక శక్తులను ఓడిస్తామని బహుజన్ సమాజ్ పార్టీ ఛీఫ్ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం అన్నారు. ఈ రోజు నిజామాబాద్ జిల్లా కేంద్రం లో జిల్లా కమిటీ ఆద్వర్యం లో ఏర్పాటు చేసిన జిల్లా సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా బహుజన పితామహులైన మహాత్మాఫూలే , సాహూజీ మహరాజ్ , బాబాసాహేబ్ అంబేద్కర్ , మాన్యవర్ కాన్షీరామ్ ల చిత్ర పటాలకు పూల మాల తో నివాళులు అర్పించి అనంతరం సమీక్ష సమావేశం లో జిల్లా కమిటీ లను సమీక్షించి కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. పార్టీ అంతర్గత నిర్మాణం మన బహుజన సమాజానికి రక్షణగా పని చేస్తుందని అన్నారు. సమాజంలో రోజు రోజుకు మత తత్వ రాజ్యాంగ వ్యతిరేక శక్తులు పెరుగుతున్నాయని అన్నారు. ఇటీవల ఆర్ ఎస్ ఎస్ ఛీఫ్ మోహన్ భగవత్ రిజర్వేషన్ల పై అనుచితంగా వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. బహుజన సమాజం ను కులం పేరు మీద మతం పేరు మీద విడదీసి దేశ ఐక్యత ను సమాజ ఐక్యత దెబ్బతినేలా చేస్తున్నాయని అలాంటి అరాచక శక్తులను అరికట్టి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.అందుకు బహుజన సమాజ చైతన్యమే ముఖ్యమని అందుకోసం బహుజన ఉద్యమం ను బలోపేతం చేయాలని నిషాని రామచంద్రం కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు రాజ్యాంగబద్ధంగా ఎన్నికల్లో గెలిచి రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని అహంకారపూరితంగా మాట్లాడుతున్న ఎవరినైనా ఓడించాలని పిలుపునిచ్చారు.

**రిజర్వేషన్లు సామాజిక న్యాయానికి నిలువుటద్దం**

రిజర్వేషన్లు సామాజిక న్యాయానికి నిలువుటద్దం అని అడ్వకేట్ నిషాని రామచంద్రం అన్నారు. ఆర్ ఎస్ ఎస్ ఛీఫ్ మోహన్ భగవత్ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడిన మాటలను ఆయన తీవ్రంగా ఖండించారు. వేలాది సంవత్సరాల నుండి అనిచివేతకు , వివక్షకు గురైన బాదిత కులాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే రిజర్వేషన్లు ఏకైక మార్గమని అన్నారు. ఆర్ ఎస్ ఎస్ సంస్థ మహిళ సాధికారత కు సమాజ అభివృద్ధి కి వ్యతిరేకమని ఆయన అన్నారు. రిజర్వేషన్లు రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నారని రిజర్వేషన్ల వలన సమాజంలో చెడు పెరుగుతుంది అని రిజర్వేషన్లు లబ్ది పొందిన వారు వాటిని స్వచ్ఛందంగా వదులుకోవాలని కోరడం ఆర్ ఎస్ ఎస్ యొక్క నిజమైన కువాదానికి నిదర్శనమన్నారు. వాటివల్ల తాత్కాలిక రాజకీయ ప్రయోజనాలు పొందుతారేమో గాని శాస్వతంగా వారు నష్టపోతారని అన్నారు. రిజర్వేషన్లు తొలగించడం వలన రాజ్యాంగ స్ఫూర్తి దెబ్బతింటుందని అన్నారు. రాజ్యాంగ లక్ష్యాలను మాత్రం నెరవేర్చలేదని అన్నారు. బాబాసాహేబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారా మాత్రమే సమాజం లో సమానత్వం ఏర్పడుతుందని అన్నారు. ఆర్ ఎస్ ఎస్ బిజెపి లు రాజ్యాంగాన్ని రద్దు చేయాలని కుట్ర చేస్తున్నాయని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో వారిని ఓడించి రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి బహుజన ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న బెహన్ జీ మాయావతి గారిని ఈ దేశ ప్రధానిని చేయాలని అందుకోసం నిజామాబాద్ ఎంపి సీటు గెలుపు కోసం బీఎస్పీ శ్రేణులు సైనికుల వలే పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్మూర్ కమిటీ వారు ఛీఫ్ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ రామచంద్రం గారిని నూతన పార్లమెంట్ ఇంచార్జ్ చిర్ర శంకర్ లను ఘనంగా సన్మానించారు. నిషాని రామచంద్రం సెక్టారు కమిటీ ల విభజన చేసి సెక్టారు కమిటీ ల నిర్మాణానికి తగు ఆదేశాలు ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో జోన్ ఇంచార్జ్ లు గైని గంగాధర్, కల్లెపెల్లి రాజేందర్ , పార్లమెంట్ ఇంచార్జ్ లు గండికోట రాజన్న చిర్ర శంకర్ జిల్లా ఉపాధ్యక్షుడు మహ్మద్ శకీల్ ఆహ్మద్ , అసెంబ్లీ ఇంచార్జి లు క్రిష్ణ యాదవ్ , రాజశేఖర్ అల్లెపు రాజు , పారీజాతం తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి షాక్: చెక్ బౌన్స్ కేసులో నాన్-బెయిలబుల్ వారెంట్

బీఆర్ఎస్ నేత, తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి హైదరాబాద్ కోర్టులో చుక్కెదురైంది. దాదాపు దశాబ్ద కాలం నాటి చెక్ బౌన్స్ కేసులో ఆయనను దోషిగా నిర్ధారిస్తూ, న్యాయస్థానం నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది.ఇంటెల్లిడెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థకు సంబంధించిన రూ. 34.23 లక్షల చెక్ బౌన్స్ కేసులో ఈ తీర్పు వెలువడింది. 2015లో రోహిత్ రెడ్డి ఆ కంపెనీలో డైరెక్టర్‌గా ఉన్న సమయంలో, సంస్థ వనరులను తన వ్యక్తిగత వ్యాపారాలకు వినియోగించి నష్టం కలిగించారనే ఆరోపణలు వచ్చాయి. ఈ వివాద పరిష్కారానికి ఇరుపక్షాల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంలో భాగంగా 2014 సెప్టెంబర్ 25న రోహిత్ రెడ్డి సదరు సంస్థకు చెక్కును అందజేశారు.అయితే, ఖాతాలో



సరిపడా నిధులు లేకపోవడంతో ఆ చెక్ 2014 అక్టోబర్, డిసెంబర్ మధ్య మూడుసార్లు బౌన్స్ అయింది. దీనిపై సంస్థ పంపిన లీగల్ నోటీసులకు రోహిత్ రెడ్డి స్పందించకపోవడంతో వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ కేసుపై సుదీర్ఘ విచారణ జరిపిన హైదరాబాద్ మొదటి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ (మున్సిపల్ కోర్టు), నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్ సెక్షన్ 138 కింద రోహిత్ రెడ్డిని దోషిగా నిర్ధారించింది.తీర్పు వెలువడే సమయంలో రోహిత్ రెడ్డి కోర్టుకు హాజరుకాకపోవడంతో న్యాయమూర్తి ఆయనపై నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. పోలీసులు ఆయన్ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచిన అనంతరం శిక్షాకాలాన్ని ఖరారు చేయనున్నారు.

# కోకాబుర్రా బంతులు శ్రీలంక పిచ్‌లు

## పడిక్కల్ శతక రహస్యమిదే



'నయావాల్' ఛతేశ్వర్ పూజారా వీడ్కోలు అనంతరం మూడో స్థానంలో నిఖార్సైన ఆటగాడి కోసం ఎదురుచూస్తున్న భారత జట్టు నిరీక్షణకు తెరపడేలా ఉంది. సాయి సుదర్శన్ గాయంతో శ్రీలంక పర్యటనకు దూరమవ్వగా.. అవకాశాన్ని అందిపుచ్చుకున్న దేవ్‌దత్ పడిక్కలశతకంతో చెలరేగాడు. ఓపెనర్లు విఫలమైనా గోడలా వికెట్ల పతనాన్ని అడ్డుకుంటూ.. కీలక భాగస్వామ్యాలు నెలకొల్పుతూ లంక బౌలర్ల భరతం పట్టిన పడిక్కల్ నేను సరైనోడిని అని నిరూపించుకున్నాడు. లంకపై అంతలా విజయవంతమవ్వడానికి పక్కా ప్లాన్‌తో సాధన చేశాడీ లెఫ్ట్ హ్యాండర్.
విదేశీ పర్యటనల్లో రాణించాలంటే అక్కడి పరిస్థితులను అర్ధం చేసుకోవాలి. ప్రత్యర్థి బౌలర్ల బల హీనతలను పసిగట్టి.. జట్టును ఆదుకునే ఇన్నింగ్స్‌లు ఆడాలి. మూడో స్థానంపై కన్నేసిన సాయి సుదర్శన్ గాయం నుంచి కోలుకోలేదు. కరుణ్ నాయర్, వాషింగ్టన్ సుందర్‌లు సైతం స్క్వాడ్‌లో లేరు. ఈ పరిస్థితుల్లో భారీ సెంచరీ కొడితే.. జట్టును గట్టెక్కిస్తే చాలు మరిన్ని అవకాశాలు వస్తాయి. వామప్ మ్యాచ్‌లో దేవ్‌దత్ పడిక్కల్ అదే పని చేశాడు.
లంక పర్యటనకు ఎంపికవ్వగానే అతడు తన బ్యాటింగ్ సన్నద్ధతను మార్చాడు. బెంగళూరులో తన చిన్నప్పటి కోచ్ మొహమ్మద్ నసీరుద్దిన్ తో కలిసి వర్కవుట్ చేశాడు. కోకాబుర్రా బంతులు, శ్రీలంక తరహా పిచ్‌లను తయారు చేయించుకొని బ్యాటింగ్ చేయడం ద్వారా అతడు వామప్ మ్యాచ్‌లో శతకం సాధించగలిగాడు.

# హై జంప్‌లో భారత్‌కు తొలి రజతం

## చరిత్ర సృష్టించిన బసంత్





అమెరికాలోని ఒరెగా వేదికగా జరుగుతున్న అండర్ 20 ఛాంపియన్‌షిప్స్ 2026లో భారత అథ్లెట్లు పతకాల వేట కొనసాగిస్తున్నారు. జావెలిన్ త్రోలో పదేళ్ల నిరీక్షణకు తెరదించుతూ అశిష్ యాదవ్‌రజతం కొల్లగొట్టగా.. హై జంప్‌లో బసంత్ కుమార్ మేఘ్వాల్ చరిత్ర సృష్టించాడు. పురుషుల ఫైనల్లో సత్తా చాటిన బసంత్ వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనతో వెండి వెలుగులు విరజిమ్మాడు.
అండర్ 20 ఛాంపియన్‌షిప్స్‌లో భారత కుర్రాళ్లు రికార్డులు పట్టేస్తున్నారు. జావెలిన్ త్రోలో భావి తారగా ఎదుగుతున్న అశీష్ యాదవ్ సిల్వర్ మెడల్ సాధించిన మరునాడే.. హై జంపర్ బసంత్ కుమార్ మేఘ్వాల్ సైతం వెండి పతకం గెలుపొందాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో భారత అథ్లెట్ రెండో ప్రయత్నంలో ఏకంగా 2.21 మీటర్ల ఎత్తు దూకాడు. తద్వారా వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనతో రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ అందుకున్నాడు. అండర్ 20 ఛాంపియన్‌షిప్స్‌లో భారత్‌కు హై జంప్‌లో తొలి పతకం సాధించిన బసంత్ చరిత్రకెక్కాడు. లాంగ్ జంప్‌లో షహన్వాజ్ ఖాన్ కాంస్యంతో మెరిశాడు. శనివారం పురుషుల జావెలిన్ త్రో ఫైనల్లో అశీష్ యాద వ్ 74.09 మీటర్ల దూరం ఈటెను విసిరి రెండో స్థానంతో రజతం పట్టేసిన విషయం తెలిసిందే. పదేళ్ల క్రితం నీరజ్ పసిడి గెలిచిన ఈ టోర్నీలో అశీష్ అంచనాలు అందుకు ఒటూ మువ్వన్నెల జెండాను రెపరెపలాడించాడు.

# షేర్-ఇ-పంజాబ్ టీ౨౦ లీగ్‌లో అభిషేక్ శర్మ గిల్

## ఏ జట్ల తరపున ఆడనున్నారంటే





పంజాబ్ క్రికెట్ సంఘం (పీసీఏ) ఆధ్వర్యంలో తొలిసారిగా జరగనున్న షేర్-ఇ-పంజాబ్ టీ20 లీగ్‌కు స్టార్ క్రికెటర్లు సిద్ధమయ్యారు. భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్, యువ సంచలనం అభిషేక్ శర్మలను అధికారులు మార్కీ ప్లేయర్లుగా ప్రకటించారు. దీంతో తొలి సీజన్‌లోనే ఈ లీగ్‌కు భారీ క్రేజ్ లభించింది. గిల్ ఫజిల్కా ఫాల్కన్స్ తరఫున బరిలోకి దిగనుండగా.. అభిషేక్ శర్మ అమృత్‌సర్ సూర్మాస్‌కు ప్రాతినిధ్యం వహించనున్నాడు. వీరితో పాటు స్టార్ ప్లేయర్లు అర్ష్‌దీప్ సింగ్, ప్రభ్‌సిమ్రన్ సింగ్, రమణ్‌దీప్ సింగ్, గుర్నూర్ బ్రార్‌లు కూడా మార్కీ ప్లేయర్లుగా వివిధ జట్లకు ఎంపికయ్యారు. ఆరు జట్లతో జరగనున్న ఈ టోర్నీలో మొత్తం 27 మ్యాచ్‌లు ఉంటాయి. ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 13 వరకు ఈ పోటీలు నిర్వహించనున్నారు. న్యూ చండీగఢ్‌లోని పీసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో లీగ్‌ను అధికారికంగా ప్రారంభించారు. పంజాబ్ నుంచి మరింత మంది ప్రతిభావంతులైన క్రికెటర్లను వెలుగులోకి తీసుకురావడమే ఈ లీగ్ ప్రధాన లక్ష్యమని పీసీఏ పేర్కొంది. తన స్వస్థలం ఫజిల్కాకు చెందిన గిల్ కూడా ఈ టోర్నీపై ఆశాభావం వ్యక్తం చేశాడు. 'పంజాబ్ ఎప్పటినుంచో గొప్ప క్రికెటర్లను భారత జట్టుకు అందిస్తోంది. ఈ లీగ్ ద్వారా మరింత మంది ప్రతిభావంతులు వెలుగులోకి వస్తారని నమ్ముతున్నా' అని గిల్ తెలిపాడు.

**అదే లక్ష్యం..**

షేర్-ఇ-పంజాబ్ టీ20 లీగ్‌లో రౌండ్ రాబిన్ విధానంలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఒక్కో ఫ్రాంచైజీకి ఒక మార్కీ ప్లేయర్‌తో పాటు కనీసం ఇద్దరు ఐకాన్ ప్లేయర్లను తీసుకునే అవకాశం ఉంటుంది. ప్రతి జట్టుకు రూ.45 లక్షల బడ్జెట్ కేటాయించగా.. గరిష్ఠంగా 20 మంది ఆటగాళ్లతో స్క్వాడ్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు.
యువ క్రికెటర్లకు స్టార్ ఆటగాళ్లతో కలిసి ఆడే అవకాశం కల్పించి.. వారిని ఉన్న త స్థాయి క్రికెట్‌కు సిద్ధం చేయడమే ఈ లీగ్ ప్రధాన ఉద్దేశమని పీసీఏ భావిస్తోంది.
పం జాబ్ క్రికెట్‌కు మరింత మంది ప్రతిభావంతులను అందించే వేదికగా షేర్-ఇ-పంజాబ్ టీ20 లీగ్‌ను తీర్చిదిద్దాలని భావిస్తోంది.

# ఢిల్లీ క్యాపిటల్స్‌లో కీలక మార్పులు కోచింగ్

## బృందంలో గంగూలీ యువరాజ్ సింగ్



ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీలో కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. భారత క్రికెట్ దిగ్గజాలు సౌరభ్ గంగూలీ, యువరాజ్ సింగ్ బెంగళూరులోని జస్ట్ క్రికెట్ అకాడ మీలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో కనిపిం చడంతో ఈ చర్చ మొదలైంది. డీసీ హెడ్ ఆఫ్ క్రికెట్‌గా గంగూలీ మళ్లీ బాధ్యతలు నిర్వర్తించనున్నాడంటూ గత కొంతకాలంగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా యువీ, గంగూలీ ఢిల్లీ శిక్షణ శిబిరంలో కనిపించడంతో సహాయక బృందంలో భారీ మార్పులు ఉండొచ్చన్న వార్తలకు మరింత బలం చేకూరింది. ఈ శిక్షణ శిబిరంలో యువరాజ్ నెట్స్ వద్దే ఉండి యువ బ్యాటర్లకు సాంకేతిక సూచనలు చేశాడు. ముఖ్యంగా పవర్ హిట్టింగ్ మెరుగుపరుచుకోవడంపై ప్లేయర్లకు సలహాలు ఇస్తూ కనిపించాడు. మరోవైపు గంగూలీ జట్టు కూర్పు, భవిష్యత్ ప్రణాళికలపై దృష్టి సారించినట్లు సమాచారం. భారత మాజీ లెగ్ స్పిన్నర్ అమిత్ మిశ్రా కూడా శిబిరంలో పాల్గొని స్థానిక బౌలర్ల ప్రతిభను పరిశీలించాడు. అయితే ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ మాత్రం ఈ విషయం గురించి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. కాగా గంగూలీ మరో సారి జట్టులో కీలక బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం. ఢిల్లీ క్యాపిటల్స్ హెడ్ ఆఫ్ క్రికెట్‌గా వ్యూహాత్మక వ్యవహారాలను పర్యవే క్షించే అవకాశం ఉంది. ఇక యువరాజ్ సింగ్ ఐపీఎల్‌లో తొలిసారి బ్యాటింగ్ మెంటార్‌గా బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది.
ఇటీవల కాలంలో యువరాజ్ సింగ్ పలువురు యువ బ్యాటర్లకు మెంటార్‌గా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ వంటి ఆటగాళ్లు అతడి సూచనలను ప్రశంసించారు. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటి ంగ్ విభాగానికి యువరాజ్ మార్గదర్శకత్వం కలిసొస్తుందని ఫ్రాంచైజీ భావిస్తున్నట్లు సమా చారం. వచ్చే సీజన్ నుంచి జేఎస్‌డబ్ల్యూ సంస్థ పూర్తిస్థాయి నిర్వహణ బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో సపోర్ట్ స్టాఫ్‌తో పాటు ఆటగాళ్ల ఎంపికలోనూ భారీ మార్పులు ఉండే అవకాశం ఉంది. ఇప్పటివరకు ఐపీఎల్ టైటి ల్ గెలవని ఢిల్లీ క్యాపిటల్స్.. ఈసారి పక్కా ప్రణాళికతో బరిలోకి దిగేందుకు సిద్ధమ వుతున్నట్లు తెలుస్తోంది. ఇక ఢిల్లీ అభిమా నులకు మరో గుడ్ న్యూస్ కూడా ఉంది. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ నుంచి స్టార్ ప్లేయర్ రిషభ్ పంత్‌ను తిరిగి జట్టులోకి తీసుకొచ్చే ప్రక్రియను ఫ్రాంచైజీ పూర్తి చేసింది. గంగూలీ వ్యూహాలు.. యువరాజ్ బ్యాటింగ్ మంత్రాలు.. పంత్ నాయకత్వం కలిస్తే ఢిల్లీ క్యాపిటల్స్ రూపురేఖలు పూర్తిగా మారే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది.

# టీమిండియా ఇన్నింగ్స్ డిక్లేర్

## నబీ సిరాజ్ చెలరేగేనా



వామప్ మ్యాచ్‌లో దేవ్‌దత్ పడిక్కల్(142 నాటౌట్) భారీ శతకంతో కోలుకున్న భారత జట్టు ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. రెండోరోజు ఓవర్ నైట్ స్కోర్ 357/6 వద్దే ఆటను ఆపేసిన టీమిండియా.. శ్రీలంకను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. స్వల్ప ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన లంకను పేసర్లు అకీబ్ నబీ, సిరాజ్‌లు వికెట్ల వేటతో దెబ్బకొడితే మ్యాచ్‌పై భారత్ పట్టు సాధించడం ఖాయం. శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్‌కు సన్నాహక మ్యాచ్‌లో భారత జట్టు ఆదిలో తడబడినా చివరకు నిలబడింది. మూడు రోజుల వామప్ మ్యాచ్‌లో ప్రధాన ఆటగాళ్లు విఫలమైనా(142 నాటౌట్) భారీ శతకంతో రెచ్చిపోయాడు. కేఎల్ రాహుల్(41), రవీంద్ర జడేజా(63 రిటైర్డ్ హర్ట్)లతో కీలక భాగస్వామ్యం నెలకొల్పిన పడిక్కల్.. ఆఖరి ఓవర్ వరకూ క్రీజునంటుకుపోయాడు.
మానవ్ సుతార్(41) సైతం గొప్పగా ఆడడంతో టీమిండియాను ఆలౌట్ చేయాలనుకున్న లంక బౌలర్ల ఆశలు ఆవిరయ్యాయి. ఓవర్‌నైట్ స్కోర్ 357/6తో రెండో రోజు ఆటను ముగించిన భారత్.. మూడో రోజు తొలి బంతికి ముందే ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ మొదలెట్టిన లంక 3 ఓవర్లకు ఏడు పరుగులు చేసింది. ప్రస్తుతానికి లంక 13 పరుగుల ఆధిక్యంలో ఉంది.

# శ్రీలంక ఎలెవన్‌తో వార్మప్ మ్యాచ్

## టీమిండియా ఘన విజయం




శ్రీలంక ఎలెవన్‌తో కొలంబో వేదికగా జరిగిన మూడు రోజుల వార్మప్ టెస్టు మ్యాచ్‌లో భారత జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మూడో రోజు 207 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా.. 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. యశస్వి జైస్వాల్(61లి) హాఫ్ సెంచరీ చేసి రిటైర్డ్ హర్ట్ అయ్యాడు. గాయం బారిన పడిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్(44) నేడు బ్యాట్ పట్టాడు. స్టార్ బౌలర్ సిరాజ్(32లి) కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఆఖరిలో హ్యాట్రిక్ సిక్సర్లు బాది ఆశ్చర్యపరిచాడు. శ్రీలంక ఎలెవన్ బౌలర్లలో కేషారా 2 విశ్వా ఫెర్నాండో, రమేశ్ మెండీస్ తలొక వికెట్ పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక ఎలెవన్ 363/8 వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే. తొలి రోజు వికెట్లు తీయడానికి ఇబ్బంది పడిన భారత బౌలర్లు.. రెండో రోజు రాణించారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 357/6 వద్ద డిక్లేర్ ఇచ్చింది. దేవదత్ పడిక్కల్(142లి) సూపర్ సెంచరీ చేశాడు. రవీంద్ర జడేజా(63లి) రాణించాడు. రెండో ఇన్నింగ్స్‌లో శ్రీలంక ఎలెవన్ 200/6 వద్ద డిక్లేర్ ప్రకటించింది. తొలి ఇన్నింగ్స్‌తో కలిపి 207 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా.. అద్భుతంగా ఛేదించింది.

# బంగ్లాదేశ్ పర్యటనకు టీమిండియా

## కేంద్రం అనుమతి కోరనున్న బీసీసీఐ



భారత క్రికెట్ జట్టు బంగ్లాదేశ్ పర్యటనపై ఇంకా ఉత్కంఠ కొనసాగుతోంది. దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వ అనుమతి కోరాలని బీసీసీఐ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో బోర్డు సొంతంగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, త్వరలోనే కేంద్రాన్ని సంప్రదించనున్నట్లు బీసీసీఐ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. అయితే తమ దేశానికి రావాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) ఇప్పటికే బీసీసీఐకి లేఖ రాసిన సంగతి తెలిసిందే. రెండు దేశాల క్రికెట్ బోర్డుల మధ్య నిరంతరం సంప్రదింపులు జరుగుతున్నాయని బీసీసీఐ అధికారి తెలిపారు. త్వరలోనే పర్యటనపై మరింత స్పష్టత వస్తుందని పేర్కొన్నారు. ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 15 వరకు భారత్‌తో పరిమిత ఓవర్ల సిరీస్‌కు బంగ్లాదేశ్ షెడ్యూల్ విండోను కేటాయించింది. ఇందులో మూడు వన్డేలు, మూడు టీ20లు ఉన్నాయి. సెప్టెంబర్ 1, 3, 6 తేదీల్లో వన్డేలు.. సెప్టెంబర్ 9, 12, 13 తేదీల్లో టీ20లు జరగాల్సి ఉంది. ఆగస్టు 28న భారత జట్టు బంగ్లాదేశ్‌కు చేరుకోవాల్సి ఉంది. అయితే కేంద్ర ప్రభుత్వ అనుమతిపైనే పర్యటన ఆధారపడి ఉన్నట్లు సమాచారం.

**ముస్తాఫిజుర్ వివాదంతోనే..**

భారత్-బంగ్లాదేశ్ క్రికెట్ సంబంధాల్లో గత కొంతకాలంగా నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ పర్యటనపై అనిశ్చితి కొనసాగుతోంది. 2026 ఐపీఎల్ వేలంలో బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను కోల్‌కతా నైట్‌రైడర్స్ రూ.9.20 కోట్లకు కొనుగోలు చేసింది. అయితే ఆ తర్వాత బీసీసీఐ ఆదేశాలతో అతడిని జట్టు నుంచి విడుదల చేయాల్సి వచ్చింది. ఈ పరిణామంపై బంగ్లాదేశ్ తీవ్రంగా స్పందించింది. అనంతరం భద్రతా కారణాలను చూపుతూ 2026 టీ20 ప్రపంచకప్ కోసం భారత పర్యటనకు తమ జట్టు రాదని బీసీబీ ప్రకటించింది. బంగ్లాదేశ్ మ్యాచ్‌లను భారత్ నుంచి ఇతర వేదికలకు మార్చాలని ఐసీసీని కోరింది. ఈ వివాదం అంతర్జాతీయ క్రికెట్‌కే పరిమితం కాలేదు. ముస్తాఫిజుర్ వ్యవహారం నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో ఐపీఎల్ ప్రసారం, ప్రచారాన్ని ఆ దేశ ప్రభుత్వం నిరవధికంగా నిలిపివేసింది.

**గతంలోనూ వాయిదా..**

భారత జట్టు 2025 ఆగస్టులో బంగ్లాదేశ్‌లో మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడాల్సి ఉంది. అయితే అంతర్జాతీయ క్రికెట్ కట్టుబాట్లు, షెడ్యూల్ సౌలభ్యం కారణంగా ఆ పర్యటనను 2026 సెప్టెంబర్‌కు వాయిదా వేశారు. ఇప్పుడు ఈ సిరీస్ ఇరు దేశాల క్రికెట్ సంబంధాలకు కీలకంగా మారింది. బంగ్లా-భారత్ మధ్య మ్యాచ్ నిర్వహించాలని బీసీబీ పట్టుదలగా ఉంది. ఇరు బోర్డుల మధ్య సంప్రదింపులు కొనసాగుతున్న నేపథ్యంలో కేంద్రం నుంచి వచ్చే నిర్ణయంపైనే సిరీస్ భవితవ్యం ఆధారపడి ఉంది. ఈ పర్యటన జరిగితే గత కొంతకాలంగా దెబ్బతిన్న భారత్-బంగ్లాదేశ్ క్రికెట్ సంబంధాలను సాధారణ స్థితికి తీసుకురావడానికి ఉపయోగపడుతుందని బీసీబీ ఆశిస్తోంది.

# అప్పుడు కలవనివ్వలేదు.. ఇప్పుడు అదే హీరోతో!



మలయాళ నటి మమితా బైజు ప్రస్తుతం వరుస విజయాలతో మంచి జోష్‌లో ఉంది. ప్రేమలు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది. 'డ్యూడ్' 'జన నాయకన్' చిత్రాలతో మరింత గుర్తింపు తెచ్చుకుంది. సూర్యతో కలిసి 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో ఈ శుక్రవారం(ఆగస్టు 14) ప్రేక్షకులను పలకరించనుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ కేరళలో శనివారం జరిగింది. ఇందులో మాట్లాడిన మమిత తన చిన్ననాటి జ్ఞాపకాలని గుర్తుచేసుకుంది. '2015లో సూర్య ఓ కార్యక్రమం కోసం కొచ్చి వచ్చారు. అప్పుడు నేను ఎనిమిది, మా అన్నయ్య ఇంటర్ చదువుతున్నాం. సూర్యని చూసేందుకు అన్నయ్య తన స్నేహితులతో కలిసి కొచ్చి వెళ్లాడు. నేనూ వెళ్తానంటే మా తల్లిదండ్రులు పంపించలేదు. అన్నయ్య సూర్యతో ఫొటో దిగి చూపించాడు. నేను చాలా బాధపడ్డాను. ఇప్పుడు అదే హీరోతో కలిసి నటించే అవకాశం దక్కింది. ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సూర్యతో కలిసి ఒకే వేదికపై నిలబడటం అదృష్టంగా భావిస్తున్నాను' అని మమిత చెప్పుకొచ్చింది. అభిమానిగా సూర్యని చూడాలనుకున్న తనకు.. ఇప్పుడు ఆయన సినిమాలో నటించే అవకాశం రావడం గొప్ప ఆశీర్వాదమని పేర్కొంది. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రం 45 ఏళ్ల వ్యక్తి 20 ఏళ్ల అమ్మాయితో ప్రేమలో పడటం అనే కాన్సెప్ట్‌తో తెరకెక్కించారు. ఇందులో రవీనా టాండన్, రాధికా శరత్‌కుమార్, నాజర్ తదితరులు కీలక పాత్రలు చేశారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతమందించాడు.




# వైజాగ్‌లో ఏఏఏ మల్టీప్లెక్స్ ప్రారంభం..

## ఇది నాకు చాలా స్పెషల్ అంటూ అల్లు అర్జున్ ట్వీట్



టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మల్టీప్లెక్స్ వ్యాపార రంగంలోకి అడుగుపెట్టడం తెలిసిందే. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఏషియన్ సినిమాస్‌తో కలిసి ఆయన 'ఏఏఏ సినిమాస్' (అల్లు అర్జున్ ఏషియన్ సినిమాస్) పేరుతో మల్టీప్లెక్స్ లు నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన ఏఏఏ సినిమాస్ మల్టీప్లెక్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ స్పందిస్తూ, వైజాగ్ నగరంపై తనకున్న అభిమానాన్ని పంచుకున్నారు.

"ఈ అద్భుతమైన నగరానికి ఏఏఏ సినిమాస్‌ను తీసుకురావడం చాలా ఆనందంగా ఉంది. నా హృదయంలో వైజాగ్‌కు ఎప్పుడూ ప్రత్యేక స్థానం ఉంటుంది. ఇక్కడ ఈ కొత్త ప్రయాణాన్ని ప్రారంభించడం మరింత ప్రత్యేకంగా అనిపిస్తోంది" అని అల్లు అర్జున్ పేర్కొన్నారు. ప్రేక్షకులకు ఒక ప్రత్యేకమైన సినిమా వీక్షణ అనుభూతిని అందించాలనే లక్ష్యంతో ఎంతో ఇష్టపడి ఈ మల్టీప్లెక్స్‌ను తీర్చిదిద్దామని తెలిపారు. ఈ కొత్త ప్రయాణంలో అందరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

హైదరాబాద్‌లోని అమీర్‌పేటలో ఇప్పటికే ఏఏఏ సినిమాస్ విజయవంతంగా నడుస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు విశాఖపట్నంలో కూడా తమ బ్రాంచ్‌ను విస్తరించడం ద్వారా అల్లు అర్జున్ థియేటర్ వ్యాపారంలో తనదైన ముద్ర వేస్తున్నారు.

# వెండితెరను వణికించేందుకు రాబోతున్న మీర్జాపూర్..

## ట్రైలర్ వచ్చేది ఆరోజే!



భారతీయ ఓటీటీ చరిత్రలో సరికొత్త సంచలనాలు సృష్టించి, ప్రేక్షకులను విపరీతంగా అలరించిన మోస్ట్ పాపులర్ క్రైమ్ థ్రిల్లర్ ఫ్రాంచైజీ 'మీర్జాపూర్' ఇప్పుడు బిగ్ స్క్రీన్ పైకి దూసుకొస్తోంది. ఓటీటీ నుంచి నేరుగా వెండితెరపైకి అడుగుపెడుతున్న ఈ భారీ చిత్రం 'మీర్జాపూర్: ది మూవీ' కోసం దేశవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. కాగా, సినిమాపై అంచనాలను తారాస్థాయికి తీసుకువెళ్లేందుకు మేకర్స్ తాజాగా ఒక క్రేజీ అప్‌డేట్‌ను అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి సంబంధించిన మోస్ట్ అవేటెడ్ ట్రైలర్‌ను ఆగస్టు 11న గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో సోషల్ మీడియాలో అభిమానుల ఉత్సాహం తారస్థాయికి చేరింది. కాలీన్ భయ్యా (పంకజ్ త్రిపాఠి), గుడ్డు పండిట్ (అలీ ఫజల్) మరియు అందరితో పాటు ప్రత్యేక ఆకర్షణగా నిలిచే మున్నా భయ్యా (దివ్యేందు) వంటి ఐకానిక్ పాత్రలతో ఈ సినిమా తెరకెక్కుతోంది. కేవలం డిజిటల్ స్క్రీన్‌లకే పరిమితం కాకుండా, ఈసారి ఏకంగా వెండితెరపై పవర్-ప్యాక్డ్ యాక్షన్‌తో సరికొత్త రికార్డులు సృష్టించేందుకు ఈ ఫ్రాంచైజీ సిద్ధమైంది. ఈ యాక్షన్ డ్రామా ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 4న కేవలం థియేటర్లలో మాత్రమే విడుదల కానుంది




# విజయ్ సేతుపతి 'స్లమ్ డాగ్' నుంచి అదిరిపోయే అప్డేట్.. ఇంటెన్స్ లుక్‌లో టబు !

కోలీవుడ్ వెర్సటైల్ యాక్టర్ మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి, టాలీవుడ్ డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్లమ్ డాగ్'పై మరోసారి ఆసక్తి పెరుగుతోంది. ఈ ప్రాజెక్ట్ ప్రకటించిన సమయంలోనే విజయ్ సేతుపతి, పూరి జగన్నాథ్ కాంబినేషన్ కావడంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే సినిమా నిర్మాణం అనుకున్న దానికంటే ఎక్కువ సమయం తీసుకోవడంతో విడుదల ఆలస్యమవుతూ వచ్చింది. కొంతకాలం పాటు చిత్రబృందం నుంచి ఎలాంటి అప్‌డేట్స్ లేకపోవడంతో సినిమాపై చర్చ కూడా తగ్గిపోయింది. తాజాగా మేకర్స్ మళ్లీ ప్రమోషన్ మొదలుపెట్టడంతో 'స్లమ్ డాగ్' మరోసారి వార్తల్లో నిలుస్తోంది. ఈ సినిమా నుంచి తాజాగా సీనియర్ నటి టబుకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్న టబును 'గౌరి హెగ్డే' అనే పాత్రలో పరిచయం చేశారు. పోస్టర్‌ను పరిశీలిస్తే టబు పాత్ర సినిమాకు చాలా కీలకంగా ఉండబోతుందనే ఆసక్తి కలుగుతోంది. ఆమె పాత్ర స్వభావం, కథలో ఎలాంటి మలుపులు తీసుకురాబోతుందనే విషయాలను మాత్రం మేకర్స్ ప్రస్తుతానికి సీక్రెట్‌గా ఉంచారు. అంతేకాదు.. టబు పాత్రకు సంబంధించిన గ్లింప్స్‌ను ఆగస్టు 10న ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. దీంతో ఈ గ్లింప్స్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. విజయ్ సేతుపతి, పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రం సాలిడ్ యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. పూరి జగన్నాథ్ సినిమాల్లో కనిపించే మాస్ ఎలిమెంట్స్‌కు విజయ్ సేతుపతి నటన తోడవడంతో ఈ ప్రాజెక్ట్‌పై మొదటి నుంచే మంచి బజ్ ఉంది. ఈ సినిమాను జేబీ మోషన్ పిక్చర్స్, ఛార్మి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.ఇప్పటివరకు ఆలస్యం కారణంగా సైలెంట్‌గా ఉన్న 'స్లమ్ డాగ్' నుంచి వరుస అప్‌డేట్స్ రాబోతున్నట్లు తెలుస్తోంది. టబు గ్లింప్స్‌తో మొదలైన ఈ కొత్త ప్రమోషన్ క్యాంపెయిన్.. రాబోయే రోజుల్లో మరిన్ని ఆసక్తికరమైన అప్డేట్స్‌తో సినిమాపై హైప్‌ను పెంచే అవకాశం ఉంది

# 'చెన్నై లవ్ స్టోరీ' ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్.. కిరణ్ అబ్బవరం మూవీ స్ట్రీమింగ్ ఎక్కడ అంటే?



టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటించిన లేటెస్ట్ లవ్ ఎంటర్‌టైనర్ 'చెన్నై లవ్ స్టోరీ' థియేటర్లలో మంచి స్పందన అందుకుంది. జులై 24న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా పాజిటివ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను రాబట్టింది. 'బేబీ' సినిమాతో సక్సెస్ అందుకున్న సాయి రాజేశ్, నిర్మాత ఎస్‌కేఎన్ కాంబినేషన్‌లో వచ్చిన ఈ చిత్రం మరో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. సుమారు రూ.15 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన 'చెన్నై లవ్ స్టోరీ' ప్రపంచవ్యాప్తంగా రూ.50 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించినట్లు చిత్రబృందం వెల్లడించింది. థియేటర్లలో సినిమా చూసిన ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందనతో పాటు.. ఓటీటీలో ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్న వారి సంఖ్య కూడా పెరిగింది. ఈ సినిమాకు సంబంధించిన డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ సోనీ లివ్ సొంతం చేసుకున్నట్లు సమాచారం. ఆగస్టు 21 నుంచి ఈ సినిమా ఓటీటీలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే అధికారిక స్ట్రీమింగ్ తేదీపై మేకర్స్ లేదా ఓటీటీ సంస్థ నుంచి స్పష్టమైన ప్రకటన రావాల్సి ఉంది. తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ 'చెన్నై లవ్ స్టోరీ' స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి రానున్నట్లు సమాచారం. థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు, ఇప్పటికే చూసి మరోసారి సినిమా చూడాలనుకునేవారికి ఓటీటీ రిలీజ్ మంచి అవకాశంగా మారనుంది. 'చెన్నై లవ్ స్టోరీ' కథ విషయానికి వస్తే.. నివి అనే యువతి తన ప్రియుడు అజయ్‌ను పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంటుంది. పెళ్లికి సిద్ధమవుతున్న సమయంలో అజయ్ తనకు మరో అమ్మాయి అంటే ఇష్టమని చెప్పి ఆమెతో విడిపోతాడు. ఊహించని బ్రేకప్‌తో నివి తీవ్రంగా కుంగిపోతుంది. ఆ బాధ నుంచి బయటపడేందుకు ఆమె స్నేహితులు నివిని చెన్నైకి తీసుకెళ్తారు. కానీ అక్కడ కూడా ఆమె తన గతాన్ని మర్చిపోలేకపోతుంది. క్రమంగా మద్యానికి బానిసగా మారుతుంది. అదే సమయంలో అనుకోకుండా ఆమె జీవితంలోకి స్టీవెన్ శంకర్ అనే యువకుడు వస్తాడు. అనాథ అయిన స్టీవెన్‌కు డైరెక్టర్ కావాలన్నది కల. నివి స్నేహితుల గ్యాంగ్ అతడికి ఆశ్రయం కల్పిస్తుంది. మొదట్లో స్టీవెన్ చేసే పనులు, అతడి ప్రవర్తన నివికి చిరాకు తెప్పిస్తాయి. అయితే కాలక్రమంలో స్టీవెన్ మాటలు, అతడి ఆలోచనా విధానం నివిలో మార్పు తీసుకొస్తాయి. తన గత ప్రేమ వైఫల్యం నుంచి నెమ్మదిగా బయటపడిన నివి.. స్టీవెన్‌కు దగ్గరవుతుంది. ఇద్దరి మధ్య ప్రేమ మొదలవుతుంది. అయితే అప్పుడే నివి గతం మరోసారి ఆమె ముందుకు వస్తుంది. అజయ్ మళ్లీ ఆమె జీవితంలోకి ఎందుకు వచ్చాడు? నివి, స్టీవెన్‌ల ప్రేమకు ఎలాంటి సమస్యలు ఎదురయ్యాయి? చివరకు నివి ఎవరిని పెళ్లి చేసుకుంది? అనే అంశాలతో కథ ఆసక్తికరంగా సాగుతుంది. ఈ చిత్రంలో కిరణ్ అబ్బవరం సరసన శ్రీ గౌరీ ప్రియ హీరోయిన్‌గా నటించారు. త్రిగుణ్, దేవీ ప్రసాద్, సిరి హన్మంతు, పి. వాసు తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమాతో రవి నంబూరి దర్శకుడిగా పరిచయం అయ్యారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613